మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక
అమరావతి
ఎన్టీఆర్ | పల్నాడు | కృష్ణ
గుంటూరు | బాపట్ల | ప్రకాశం
ఆదివారం 30 ఆగస్టు 2026 పేజీలు 16

## జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థుల వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం

- సెప్టెంబర్ 2న మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 4 అత్యాధునిక హాస్టల్ భవనాల నిర్మాణం
- 1,440 మంది బాలబాలికలకు లభించనున్న వసతి సౌకర్యం
- జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ



7



# పీ.జీ.ఆర్.ఎస్ పై ప్రజల్లో నమ్మకం పెరిగింది

- సమస్యల పరిష్కారంలో వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తితో ఉన్నారు.
- ప్రజల వినతుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేసింది.
- ఆర్.టీ.జీ.ఎస్ ద్వారా స్వయంగా ముఖ్యమంత్రే పరిష్కార తీరును పరిశీలిస్తున్నారు.
- ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.
- రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటికి రాఖీలు కట్టిన తెలుగు మహిళలు.
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించిన ప్రత్తిపాటి

10

ప్రభుత్వం తీసుకొచ్చిన పీ.జీ.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సెల్ సిస్టమ్) వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



# ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–3 పనులను వేగంగా పూర్తి చేస్తాం

**గుంటూరు 29(మనసులో మాట ):** నగర పరిధిలో చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులను వేగవంతం చేసి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
శనివారం శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులను స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకులతో కలిసి పెమ్మసాని పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ సమయంలో ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో చర్చించారు.

**4.25 కి.మీ రహదారికి రూ.48 కోట్లు**

శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు

..మిగతా 10లో



## గత పాలకుల నిర్లక్ష్యమే పట్టణ పారిశుధ్య వ్యవస్థను దిగజార్చింది

- కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రజల్లో చైతన్యం వచ్చి, పారిశుధ్యం మెరుగుపడింది.
- మత్స్య ఉత్పత్తుల విక్రయాల కోసమే ప్రత్యేకంగా మోడరన్ ఫిష్ మార్కెట్ నిర్మించాం.
- ఇకపై ఎవరూ ప్రధాన రోడ్లు, వీధుల్లో క్రయవిక్రయాలు జరపడానికి వీల్లేదు.
- రూ.1.25 కోట్లతో సకల హంగులతో నిర్మించిన చేపల మార్కెట్ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.

9



## కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

6

- ఏరియా ఆసుపత్రిలో 6వ రోజు నల్ల బ్యాడ్జీలతో 'లంచ్ అవర్' నిరసన

## వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి: కలెక్టర్

2



# వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి: కలెక్టర్

**గుంటూరు, ఆగస్టు 29 మనసులో మాట:**

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారి సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ ఆదేశించారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలను సులభంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేలా గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తమ వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు



వచ్చారు.

**పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌పై అర్జీలు**

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనాలు అందకపోవడం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్, వైద్య సేవలు, వివిధ రకాల ధ్రువపత్రాలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను వారు అధికారులకు వివరించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించిన అధికారులు, సంబంధిత శాఖల పరిధిలోని సమస్యలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు సంబంధించిన శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు మానవతా దృక్పథంతో పాటు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించడంతో పాటు, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా డిప్లొమా ఫ్రెషర్స్ డే వేడుకలు

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

స్థానిక ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా ప్రథమ సంవత్సర విద్యార్థుల కోసం శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని డా. ఏ.పి.జె.అబ్దుల్ కలాం ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి నరసరావుపేట మండల రెవెన్యూ అధికారి షేక్ మహమ్మద్ హుస్సైన్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి షేక్ మహమ్మద్ హుస్సైన్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన ఇంజనీర్లుగా ఎదిగి



సమాజ హితానికి తోడ్పడాలని ఆకాంక్షించారు.కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా, సాంస్కృతిక రంగాలకు కళాశాల అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సెక్రెటరీ & కరెస్పాండెంట్ శ్రీ షేక్ కరీం మోహిద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇండస్ట్రీ అవసరాలకు తగినట్లుగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, అందుకు అవసరమైన శిక్షణ కళాశాల నిరంతరం అందిస్తుందని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రయోగశాలలు, విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ వి.ప్రవీణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు,సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా, వినోద పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథి, కళాశాల యాజమాన్యం చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, డిప్లొమా మరియు ఇతర విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేదా స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం

**చిలుకలూరిపేట ఆగస్టు 29 మనసులోమాట**

వేద స్కూల్లో ఈరోజు అనగా ఆగస్టు 29 తేదీన తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వందేమాతరం గేయంతో సభ ప్రారంభమైనది .తదుపరి ప్రతిజ్ఞ చిన్నారులు ప్రదర్శించిన కవుల మరియు పండితుల వేషధారణలు ఉపన్యాసములతో శతక పద్యాలు శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీగిరి డేవిడ్ స్నేహల్ తెలుగు



భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పాఠశాల సి ఈ ఓ అయినా శామ్యూల్ రాజ్ తెలుగు భాష మన మాతృభాష అని, మాతృభాషలో రాణించినట్లయితే ఇతర భాషలలో మనము పట్టు సాధించగలం ,విద్యార్థిని విద్యార్థులకు మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు .పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సత్య దీప్తి విద్యార్థులను ఉద్దేశించి మాతృభాషా దినోత్సవాన్ని గిడుగు రామమూర్తి జన్మదిన సందర్భంగా జరుపుకుంటాము. గిడుగు వారు వ్యవహారిక భాష ఉద్యమాన్ని కొనసాగించి తెలుగు సులభతరం చేశారు. గిడుగు సవరభాషను అభివృద్ధిలోనికి లోనికి తెచ్చారు .ఈ కార్యక్రమంలో సి ఈ ఓ శామ్యూల్ రాజ్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి కోఆర్డినేటర్ వర్షిత జూనియర్ బ్లాక్ ఇన్చార్జ్ సౌజన్య వ్యాయామ ఉపాధ్యాయులు మనోహర్ తెలుగు హెచ్ ఓ డి పార్థసారథి రమేష్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యలమంద జంక్షన్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు, ఓవర్‌లోడ్‌తో నడుపుతున్న ఆటోలపై రూరల్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అనుమతికి మించి మితిమీరిన లోడ్‌తో రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న లారీలు,టిప్పర్లు,అలాగే పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలను గుర్తించి ట్రాఫిక్ నిబంధనల ప్రకారం భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. అధిక లోడుతో వాహనాలు నడపడం వల్ల బ్రేకులు ఫెయిల్ అవ్వడం,వాహనం అదుపు తప్పడం వంటి తీవ్ర సమస్యలు తలెత్తి నిండు ప్రాణాలు గాల్లో కలుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఆటో డ్రైవర్లు నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువ మందిని ఎక్కించుకోకూడదని, డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లు మాట్లాడటం,మితిమీరిన వేగంతో నడపడం,మద్యం సేవించి డ్రైవ్ చేయడం చట్టరీత్యా నేరమని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ల డ్రైవర్లు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పించారు.ప్రతి వాహనదారుడు ఆర్సీ, ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను కలిగి ఉండాలని ,ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ తో పాటు కానిస్టేబుల్ రవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దాచేపల్లి ఇంచార్జ్ ఏడీఈగా బి. భగవాన్ బాధ్యతల స్వీకరణ

**దాచేపల్లి, ఆగస్టు 29 : ( మనసులో మాట )**

విద్యుత్ శాఖ దాచేపల్లి సబ్ డివిజన్ ఇంచార్జ్ ఏడీఈగా బి. భగవాన్ బాధ్యతలు స్వీకరించారు. దాచేపల్లి సబ్ డివిజన్ పరిధిలో దాచేపల్లి టౌన్, దాచేపల్లి రూరల్, మాచవరం సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం బి. భగవాన్ దాచేపల్లి టౌన్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు సీనియర్ సర్వీస్ ఉన్నందున ఏపీ సీ పీ డీ సీ ఎ ల్ సీఎండీ ఆదేశాల మేరకు ఇంచార్జ్ ఏ డీ ఈ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆయనను శాలువా, బొకేతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పి. సందీప్ కుమార్, జేఏఓ కె. ఆశీర్వాదం, ఏఈలు డి. నాగేశ్వరరావు, శంకర్రావు, సబ్ ఇంజనీర్ గంగాధర్ ఆపరేషన్, వీఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.





# బాధిత బాలికను పరామర్శించి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

**అవనిగడ్డ ఆగష్టు 29 (మనసులో మాట ):**

అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై ఓ 57 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్లు నమోదైన ఘటనలో బాధిత బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాలికకు ఇటీవల మగ శిశువు జన్మించిన నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన విక్కుర్తి శ్రీనివాసరావు వారికి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితి, పసిబిడ్డ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.బాధిత కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు తాము అండగా ఉంటామని విక్కుర్తి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు.





# అరణ్యారామం ప్రదేశాన్ని సందర్శించిన ఏపీ గ్రీన్ సొసైటీ చైర్‌పర్సన్

**గుంటూరు, ఆగస్టు 29 ( మనసులో మాట):**

ఏపీ గ్రీన్ సొసైటీ చైర్‌పర్సన్ శ్రీ కొణిదెల నాగేంద్రబాబు గారు శనివారం అరణ్యారామం ప్రదేశాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న పనులను పరిశీలించారు. అరణ్యారామం ప్రదేశంలో చేపడుతున్న వృక్షాల తరలింపు (ట్రాన్స్‌లొకేషన్) ప్రక్రియను ఆయన పరిశీలించి, అభివృద్ధి పనుల సందర్భంగా అక్కడ ఉన్న వృక్షాలను పరిరక్షించి, సంరక్షించేందుకు అటవీ శాఖ చేస్తున్న కృషిని అభినందించారు.

ఇప్పటివరకు వృక్ష సంరక్షణ చర్యల్లో భాగంగా అరణ్యారామం ప్రదేశం నుంచి 45 చెట్లను విజయవంతంగా తరలించారు. అనంతరం శ్రీ కొణిదెల నాగేంద్రబాబు గారు అరణ్యారామం లేఅవుట్ ప్రణాళికలు, ప్రతిపాదిత అభివృద్ధి పనులను ప్రదర్శిస్తున్న ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం నందనవనం ప్రదేశాన్ని సందర్శించి, శుభప్రదంగా భావించే వేప, రావి చెట్లను కలిపి నాటారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ కార్యకలాపాలకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులను సమీకరించేందుకు పరిశ్రమలు, ఇతర రంగాల ప్రతినిధులకు అవగాహన కల్పించే అంశంపై శ్రీ కొణిదెల నాగేంద్రబాబు గారు అటవీ శాఖ అధికారులతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు పరిశ్రమలు, ఇతర భాగస్వామ్య వర్గాలు చురుకైన భాగస్వామ్యం అందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో డా. పి.వి. చలపతి రావు, PCCF & HoFF; శ్రీ బి.ఎన్.ఎన్. మూర్తి, IFS, CCF, SFDA & CEO, ఏపీ గ్రీన్ సొసైటీ; శ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి, IFS, CCF, గుంటూరు; శ్రీ ఎన్. నాగేశ్వరరావు, IFS, CCF, వైల్డ్‌లైఫ్ & HRD, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.





# మెగా డీఎస్సీపై ఆరోపణలు బాధాకరం: అభ్యర్థుల ఆవేదన

**రేపల్లె ఆగస్టు 29 మనసులో మాట:**

మెగా డీఎస్సీ-2025 నియామకాల్లో తమ సొంత ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన నిరుపేద, మధ్యతరగతి అభ్యర్థుల విజయాలను రాజకీయ స్వార్థం కోసం కొందరు అవమానించడం బాధాకరమని పలువురు అభ్యర్థులు మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్ కుమార్తె అయిన నవ్య ఎంతో కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే మెగా డీఎస్సీలో విజయం సాధించి, రేపల్లె మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరినట్లు తెలిపారు. తమలాంటి 90 శాతం మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు సొంత ప్రతిభ, కష్టంతోనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు.

"రాజకీయ లబ్ధి కోసం కొందరు చేస్తున్న ఆరోపణలు మా శ్రమను, ప్రతిభను అవమానించేలా ఉన్నాయి. ఎన్నో కష్టాలు పడి సాధించిన ఉద్యోగాన్ని ఇలా రాజకీయ వివాదాల్లోకి లాగడం బాధాకరం" అని నవ్య తన ఆవేదనను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా రేపల్లెకు చెందిన సుధీర్ మాట్లాడుతూ.. "2014, 2018 డీఎస్సీల్లో తృటిలో అవకాశం చేజారినా అధైర్య పడలేదు. 12 ఏళ్లుగా రాత్రింబవళ్లు కష్టపడి చదివి మెగా డీఎస్సీ-2025లో ఉద్యోగం సాధించాను. నా కల నెరవేరినందుకు ఎంతో సంతోషించాను. అయితే పారదర్శకంగా జరిగిన నియామకాలపై కొందరు రాజకీయ స్వార్థంతో బురదజల్లడం బాధిస్తోంది. ఎంతో శ్రమించి సాధించిన మా విజయాలను అవమానించవద్దు" అని కోరారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల కష్టాన్ని, ప్రతిభను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని అభ్యర్థులు పేర్కొన్నారు.

# జడ్పీ హైస్కూల్ నందు మాతృభాష మరియు క్రీడా దినోత్సవం వేడుకలు

**వినుకొండ- ఆగస్టు 29, (మనసులో మాట )**

వినుకొండ పట్టణంలోని స్థానిక జడ్పీ హైస్కూల్ (ఎన్ ఎస్పీ కాలనీ ) నందు జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు మాతృభాషా దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.. తొలుత గిడుగు రామమూర్తి మరియు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా క్రీడా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను, అదే విధంగా మేజర్ ధ్యాన్ చంద్ జన్మ దినోత్సవం పురస్కరించుకొని హాకీ క్రీడ నందు భారత జాతీయ పతాకాన్ని ప్రపంచస్థాయిలో పేరు తీసుకొచ్చిన



టువంటి మేజర్ ధ్యాన్ చంద్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా మాతృభాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఇటీవల పాఠశాల నుండి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బాలికల విభాగంలో ఎంపికైన 9వ తరగతి విద్యార్థులు కె హర్షశ్రీ . డి .శ్రావణి లను ప్రత్యేకంగా బహుమతులతో అభినందించారు .అదేవిధంగా ఇటీవల అమరావతి ఛాంపియన్ షిప్ కబడ్డీ మరియు చెస్ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే ఇటీవల బాల్ బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో భారతదేశం నుండి ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన ముక్కపాటి లిఖితకు మరియు క్రీడా కోటాలో నూజివీడుట్రిపుల్ ఐటీ లో సీటు సాధించి చదువుతున్న ఉప్పు బసవరాణి లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సంవత్సరము క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వీరప్పయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రాంబాబు, ఎలిజిబెత్ రాణి, శాంతి , గోవింద్ నాయక్, మల్లయ్య,సంధ్య, కోటి రత్నములు పాల్గొన్నారు,

# విప్పర్ల రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల రెడ్డిపాలెం గ్రామంలోని పి.ఎం.శ్రీ ఎ.పి. మోడల్ స్కూల్‌లో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి (తెలుగు భాషా దినోత్సవం), హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి (జాతీయ క్రీడా దినోత్సవం) వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషా గొప్పదనంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్, కంఠస్థ పద్యాలు, కవుల చిత్రపటాల సేకరణ వంటి పోటీలు నిర్వహించారు. అలాగే క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖోఖో, కబడ్డీ, క్రికెట్ ఆటల పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు పి.ఎం. శ్రీ లోగోతో కూడిన బంగారు, రజత పతకాలు, ట్రోఫీలను బహూకరించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఎదిగినా తమ మాతృభాషను, మూలాలను, సంప్రదాయాలను మరువకూడదని, తల్లి భాషను గౌరవించడం



తల్లిని గౌరవించడంతో సమానమని పేర్కొన్నారు. అలాగే హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను, కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ఎస్.ఎం.సి. కమిటీ సభ్యులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

మనసులో మాట

## పిడుగురాళ్ల ప్రజలకు శుభవార్త..

# సెప్టెంబర్ 4 నుంచి ఎంప్లాయిస్ ట్రైన్ స్టాపేజ్




**పిడుగురాళ్ల ఆగస్టు 29 (మనసులో మాట ):**

పల్నాడు జిల్లా ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ఎంపీ కృష్ణదేవరాయలు చేసిన ప్రయత్నాలు ఫలించడంతో లింగంపల్లి-విజయవాడ-లింగంపల్లి మధ్య నడిచే *ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12795/12796)*కు పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో స్టాపేజ్ మంజూరైంది. దక్షిణ మధ్య రైల్వే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయగా, సెప్టెంబర్ 4, 2026 నుంచి పిడుగురాళ్లలో ఈ రైలు ఆగనుంది. దీంతో నిత్యం విజయవాడ, హైదరాబాద్ వైపు ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

**పిడుగురాళ్లలో రైలు సమయాలు**

12796 లింగంపల్లి □ విజయవాడ
లింగంపల్లి: ఉదయం 4:40 గంటలకు బయలుదేరుతుంది.
పిడుగురాళ్ల: ఉదయం 8:06 గంటలకు చేరుకుని 8:07 గంటలకు బయలుదేరుతుంది.
విజయవాడ: ఉదయం 10:35 గంటలకు చేరుకుంటుంది.

12795 విజయవాడ □ లింగంపల్లి
విజయవాడ: సాయంత్రం 5:30 గంటలకు బయలుదేరుతుంది.
పిడుగురాళ్ల: రాత్రి 7:08 గంటలకు చేరుకుని 7:09 గంటలకు బయలుదేరుతుంది.
లింగంపల్లి: రాత్రి 11:35 గంటలకు చేరుకుంటుంది.

**పల్నాడు ప్రజలకు భారీ ప్రయోజనం**

పిడుగురాళ్లలో ఎంప్లాయిస్ ట్రైన్ స్టాపేజ్ అందుబాటులోకి రావడంతో పల్నాడు పరిసర ప్రాంతాల నుంచి హైదరాబాద్, విజయవాడ వైపు రాకపోకలు సాగించే వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. తమ విన్నపాన్ని మన్నించి పిడుగురాళ్లలో స్టాపేజ్‌కు అనుమతి ఇచ్చిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇతర రైల్వే అధికారులకు ఎంపీ కృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు.




# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ పేపర్ చిత్రం

**తెనాలి ఆగష్టు 29 (మనసులో మాట ):**

హాకీ మాంత్రికుడిగా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మేజర్ ధ్యాన్‌చంద్ భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడని పలువురు కొనియాడారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్, కార్టూనిస్ట్ పణిదెపు వెంకట కృష్ణ (కృష్ణశ్రీ) వినూత్నంగా నివాళులర్పించారు. A4 కలర్ పేపర్‌ను కళాత్మకంగా కత్తిరించి మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రాన్ని రూపొందించారు. ఈ పేపర్ ఆర్ట్ ద్వారా జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణశ్రీ రూపొందించిన ఈ చిత్రాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు అభినందించి, ఆయన కళా ప్రతిభను ప్రశంసించారు.





# దశాబ్దాల సేవకు గుర్తింపు.. వర్ల రామయ్యకు ఆత్మీయ అభినందన సభ

**గుంటూరు ఆగస్టు 29 మనసులో మాట :**

తెలుగుదేశం పార్టీలో దశాబ్దాలుగా నిబద్ధతతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన సీనియర్ నాయకుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరై వర్ల రామయ్యను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి వర్ల రామయ్య దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, క్రమశిక్షణ ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రజా సమస్యలను బలంగా వినిపిస్తూ, ప్రజా సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. వర్ల రామయ్యను శాసనమండలి సభ్యునిగా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు నక్కా ఆనందబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



# అంకితభావ సేవలకు అభినందనలు జి. సరస్వతి కి ఘన సత్కారం

**పెదనందిపాడు ఆగస్టు 29 (మనసులో మాట)**

పెదనందిపాడు కళాశాలలోఎమ్.సి.ఎ విభాగ కార్యాలయ సహాయకురాలు జి. సరస్వతి సోమవారం పదవీ విరమణ సందర్భంగా. కళాశాల అధ్యాపకు లు శనివారం సాయంత్రం కళాశాల ఆవరణలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్.సి.ఎ విభాగం హెచ్.ఓ.డి డాక్టర్. జి. వీర రాఘవయ్య మాట్లాడుతూ, సుమారు 28 సంవత్సరాల పాటు ఎమ్.సి.ఎ విభాగంలో సహాయకురాలిగా జి. సరస్వతి ఎంతో అంకితభావంతో, క్రమశిక్షణతో, నిబద్ధతతో సేవలందించారని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా నిరంతరం పర్యవేక్షిస్తూ, విభాగం సజావుగా కొనసాగేందుకు తన వంతు సహకారాన్ని అందించారని ప్రశంసించారు.ఈ విద్యా సంవత్సరంలో కూడా తమ సేవలను పూర్తిగా వినియోగించుకోకుండానే పదవీ విరమణ చేయడం ఒకింత బాధాకరంగా ఉందని, వారితో ఇన్నేళ్లుగా కలిసి పనిచేసిన కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు మరియు కళాశాల అధ్యాపకులు తమ ఆత్మీయ భావాలను వ్యక్తం చేశారు.అనంతరం జి. సరస్వతి శాలువాతో ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. ప్రతాప్ కుమార్, డాక్టర్.పాతూరి శ్రీనివాస్ . డి. గీతా లక్ష్మి . గ్రేస్ విక్టోరియా కె. శ్రీనివాస్ మూర్తి జి.వి.డి.ఎస్ ప్రసాద్ సి.ఎల్.ఎన్. రెడ్డి డి.రాజేష్ కుమార్ ఎ. శ్రీనివాస్ జె. శరత్ కుమార్ కె. వినోద్ కుమార్ . మిస్ పి. మాధవి. ఆఫీస్ ఇంచార్జ్ డి. లక్ష్మీనారాయణ సి.హెచ్. అనూష జె.భారతి ఎం. కవిత ఎ. సుజిత్ బాబు కె. మురళీ బాబు. ప్రవీణ్ కుమార్ మరియు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్న బీమాతో కొండంత భరోసా: ₹200 ప్రీమియంతో రూ.5 లక్షల పరిహారం

**నరసరావుపేట ఆగస్టు 29 (మనసులో మాట)::**

ఆపద సమయంలో తీసుకున్న చిన్నపాటి బీమా పాలసీ ఒక కుటుంబానికి కొండంత ధైర్యాన్ని, ఆర్థిక రక్షణను కల్పించింది. బ్యాంకులు అందించే తక్కువ ప్రీమియం బీమా పథకాలు అత్యవసర సమయాల్లో బాధిత కుటుంబాలకు ఎలా అండగా నిలుస్తాయో నిరూపించే ఘటన నరసరావుపేట కర్ణాటక బ్యాంక్ బ్రాంచ్‌లో చోటుచేసుకుంది. రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామానికి చెందిన పశ్య వెంకట నరసయ్య (52) ఈ ఏడాది జనవరి 26న నరసరావుపేట కర్ణాటక బ్యాంక్‌లో ఖాతా తెరిచారు. అదే సమయంలో బ్యాంకు సిబ్బంది సూచనతో వార్షికంగా కేవలం ₹200 ప్రీమియం చెల్లించే ప్రమాద బీమా పాలసీని తీసుకున్నారు. దురదృష్టవశాత్తు మార్చి 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, కర్ణాటక బ్యాంక్ చీఫ్ మేనేజర్ సత్య రమేష్, బ్రాంచ్ మేనేజర్ గణేష్ మరియు సిబ్బంది వెంటనే స్పందించి క్లెయిమ్ దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేశారు. దరఖాస్తు సమర్పించిన 45 రోజుల్లోనే ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా




₹5,00,000 బీమా పరిహారాన్ని మృతుడి భార్య భూలక్ష్మి ఖాతాలో జమ చేయించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి స్వల్ప ప్రీమియం పథకాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఖాతాదారులు బ్యాంకులకు వచ్చినప్పుడు సిబ్బందితో మాట్లాడి ఇలాంటి పథకాల వివరాలను తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ఇవి అనుకోని ఆపదల్లో కుటుంబాలకు బలమైన ఆర్థిక రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## సెప్టెంబర్ నాలుగు నుండి పిడుగురాళ్లలో ఆగనున్న ఎంప్లాయిస్ ట్రైన్.

- **ఫలించిన యం పి కృష్ణదేవరాయలు ప్రయత్నం.**

**కారంపూడి, ఆగస్టు 29, ( పలనాడు జిల్లా ) మనసులో మాట :**

లింగంపల్లి విజయవాడ మధ్య నడిచే ఎంప్లాయిస్ ట్రైన్ గా పిలవబడే ఇంటర్సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ నెంబర్ 12795 ట్రైన్ సెప్టెంబర్ నాలుగు నుండి పిడుగురాళ్ల స్టేషన్లో ఆపేందుకు రైల్వే శాఖ ఆమోదం కొరకు పట్టువదలని విక్రమార్కునిలా ప్రయత్నం చేసిన నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణ దేవరాయలు ప్రయత్నం ఫలించి, సూపర్ ఫాస్ట్ ఎంప్లాయిస్ ట్రైన్ ను పిడుగురాళ్లలో ఆపేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే శాఖ ఈ సూపర్ ఫాస్ట్ ఎంప్లాయిస్ ట్రైన్ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ లో నిలిచే సమయాన్ని కూడా ప్రకటించింది. లింగంపల్లి విజయవాడ ఇంటర్సిటీ సూపర్ ఫాస్ట్ ఎంప్లాయిస్ ట్రైన్ ప్రతిరోజు ఉదయం 4 గంటల 40 నిమిషాలకు లింగంపల్లిలో బయలుదేరి ఉదయం 8 గంటల 6 నిమిషాలకు పిడుగురాళ్ల స్టేషన్ కు చేరుకుని 08:07 నిమిషాలకు బయలుదేరి. ఈ ట్రైన్ విజయవాడ కు ఉదయం10:35 చేరుతుంది. తిరిగి మరల విజయవాడలో సాయంత్రం 5:30 గంటలకు బయలుదేరి రాత్రి7:08 నిమిషాలకు పిడుగురాళ్లకు చేరుకొని 7:09 నిమిషాలకు బయలుదేరి రాత్రి11:35 నిమిషాలకు లింగంపల్లి చేరుకుంటుందని రైల్వే శాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులలో ఉన్నది.

లింగంపల్లి విజయవాడ మధ్య నడిచే ఈ ఇంటర్సిటీ సూపర్ ఫాస్ట్ ఎంప్లాయిస్ ఎక్స్ప్రెస్ ట్రైన్ పిడుగురాళ్లలో ఆగ నందున పల్నాటి ప్రాంత ఉద్యోగస్తులకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఇంకా వివిధ రకాల పనులపైన, వ్యాపారాల కొరకు అనునిత్యం ఇటు గుంటూరు, విజయవాడ అటు హైదరాబాద్ వెళ్లే వారికి సమయాభావం కలిసి వచ్చి లబ్ధి చేకూరుతుందని యం పి కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ ట్రైన్ కు పిడుగురాళ్లలో స్టాపేజీ లేనందున ఇబ్బందులు పడిన పల్నాటి ప్రాంత ప్రజలు ఇకపై ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కృష్ణదేవరాయలు కోరారు. తన విన్నపాన్ని మన్నించి లింగంపల్లి విజయవాడ ఇంటర్సిటీ సూపర్ ఫాస్ట్ ఎంప్లాయిస్ ఎక్స్ప్రెస్ ట్రైన్ కు పిడుగురాళ్లలో స్టాపేజ్ కు అనుమతినిచ్చిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గారికి, మరియు ఇతర రైల్వే అధికారులకు కృష్ణదేవరాయలు ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**యడ్లపాడు ఆగస్టు 29 మనసు లో మాట**

మండలం లోని కొండవీడు కోట గ్రామ పరిధిలో 28వ తేది ఉదయం సుమారు 09:30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జల్లిక బీ అనే మహిళ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఎస్ ఐ టి శివ రామకృష్ణ తెలిపిన సమాచారం మేరకు జల్లిక బీ తన చిన్న కుమారుడితో కలిసి వ్యవసాయ క్షేత్రానికి కాలినడకన వెళ్తుండగా, గుల్షావలి గెస్ట్ హౌస్ సమీపంలో రహదారి దాటుతున్న సమయంలో ఫిరంగిపురం వైపు నుండి చెంగిస్ ఖాన్ పేట వైపు వెళ్తున్న AP 40 FE 4880 నంబరు గల ద్విచక్ర వాహనదారుడు వేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఆమెను ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో జల్లిక బీ కిందపడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు చెవుల నుండి రక్తస్రావం జరిగింది. స్థానికుల సహాయంతో ఆమెను ఫిరంగిపురం తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని లైఫ్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ICUలో చికిత్స పొందుతూనిన్న ఉదయం మృతి చెందారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి సంబంధించిన తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్ ఐ టి శివరామకృష్ణ తెలిపారు.





## వ్యావహారిక భాషా వికాసానికి గిడుగే స్ఫూర్తి

- **మాతృభాషకు మనమే రక్ష:కెజిబివి లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం**

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

మాతృభాష విజ్ఞానానికి, భావ వ్యక్తీకరణకు ఆయువుపట్టని, మన మాతృభాషను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. వ్యావహారిక భాషా పితామహుడు, సంఘ సంస్కర్త, శాసన పరిశోధకుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 163వ జయంతి సందర్భంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇస్తర్ల ఉష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు, అధ్యాపకులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమ నిర్వాహకులు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ గిడుగు వ్యావహారిక భాషా పిడుగు అని, 1885 నుంచి 50 ఏళ్ల పాటు మాతృభాష సంస్కరణ ఉద్యమాన్ని నడిపారని కొనియాడారు.గురజాడ అప్పారావు,పి.టి.శ్రీనివాస అయ్యంగార్,యేట్స్ దొరల సహకారంతో ఉద్యమించి విజయం సాధించారని, శ్రీముఖలింగం దేవాలయంలోని గాంగ వంశ రాజుల శాసనాలను పరిష్కరించి భాషను సరళంగా అధ్యయనం చేసే మార్గాన్ని చూపించారని తెలిపారు. అలాగే సవర భాషకు లిపిని రూపొందించి, తెలుగుసవర, సవరఇంగ్లీషు నిఘంటువులను తయారు చేసి విశేష సేవలందించారని గుర్తుచేశారు. మాతృభాషలో ఉన్న అర్థ వివరణ, భావ ప్రకటన వేరే భాషలో లభించవని, అందుకే మహాత్మాగాంధీ సైతం తన ఆత్మకథను గుజరాతీ లోనే రాశారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఇ.ఉష మాట్లాడుతూ ప్రతి పాఠశాల, కళాశాలల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో మాతృభాషపై కార్యక్రమాలు చేపట్టాలని, గ్రంథాలయాల్లో సదస్సులు నిర్వహించి విద్యార్థులకు మంచి పుస్తకాలు అందించడం ద్వారా పఠనాసక్తిని పెంచాలని సూచించారు.ముఖ్యఅతిథి,విశ్రాంత ఉపాధ్యాయులు మామిళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించడం ఆనందదాయకమన్నారు.విద్యార్థులంతా గిడుగు రామమూర్తి జీవిత చరిత్రను తప్పక అధ్యయనం చేయాలని ప్రముఖ గాయకులు కొఠారి రంజిత్ కుమార్ పేర్కొనగా,నన్నయ, తిక్కన,ఎర్రన,వేమన, శ్రీనాథుడు,మొల్ల వంటి ఎందరో గొప్ప కవుల కృషితో తెలుగు సాహిత్యం సుసంపన్నమైందని తెలుగు అధ్యాపకురాలు కె.సులోచనారాణి వివరించారు.భాషా,సాహిత్య,జాతీయ, గ్రంథాలయ ఉద్యమాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పద్య కవి ఈపూరి వెంకటరెడ్డి చేసిన పద్య గానం అలరించింది.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.బాపమ్మ, గుంజి వీరాంజమ్మ,షేక్ హసీనా,పి. ఆదిలక్ష్మి,టి.మాధవి,పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే ఓటర్ లిస్ట్ జంబ్లింగ్, పోలింగ్ బూత్‌ల మార్పు

- **వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**నరసరావుపేట,ఆగస్టు 29 (మనసులో మాట)::**



రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదనే భయంతో కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకునేందుకే నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల జాబితా జంబ్లింగ్, పోలింగ్ బూత్‌ల మార్పులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రొంపిచర్ల మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, వీరపట్నం, ఎడ్వర్డ్ పేట గ్రామాల్లో ఏకపక్షంగా మార్చిన పోలింగ్ కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక నాయకులతో కలిసి ఆయన జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)కి వినతిపత్రం అందజేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 23న ఎంపీడీవో కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో పోలింగ్ బూత్‌ల జాబితాను ప్రకటించారని, అయితే టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే (ఈ నెల 28న) ఏకపక్షంగా మార్పులు చేసేశారని ఆరోపించారు.కనీసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయకుండా, ప్రతిపక్షాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా టీడీపీకి అనుకూలమైన ప్రాంతాలకు బూత్‌లను మార్చడం తీవ్ర అన్యాయమన్నారు. గతంలో ఘర్షణలు జరిగి హైకోర్టు ఆదేశాలతో నిలిచిపోయిన పడమటిపాలెం పోలింగ్ కేంద్రానికి రొంపిచర్ల పరిధిలోని 850 ఎస్సీ ,ఎస్టీ,బీసీ ఓట్లను తరలించారని తెలిపారు.అలాగే సంతగుడిపాడు లో 7 వార్డుల కేంద్రాన్ని ఎలిమెంటరీ స్కూల్ నుంచి టీడీపీ ఆధిక్యం ఉన్న జడ్పీ స్కూలుకు మార్చడంతో బలహీన వర్గాల ఓటర్లు ఒకటిన్నర కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.వీరపట్నంలో ఎస్సీ,ఎస్టీ వార్డులను ఓసీల ప్రాంతాలకు,ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతమైన ఎడ్వర్డ్ పేటలో నాలుగు వార్డుల బూత్‌లను పూర్తిగా టీడీపీ వారి ఇలాకాలకు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనకంచివారిపాలెంలోనూ ఎస్సీల ఓట్లను చెల్లాచెదురుగా జంబ్లింగ్ చేశారని తెలిపారు.పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేకనే ఈ రకమైన కుట్రలు పన్నుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి ఈ అక్రమ మార్పులను రద్దు చేయాలని, బలహీన వర్గాల ప్రజలు నిర్భయంగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డితో పాటు రొంపిచర్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాస్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు,సంజీవ రెడ్డి, ఎడ్వర్డ్ పేట వెంకటేశ్వర్ రెడ్డి, వీరపట్నం నాయకులు శివారెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సేంద్రియ ఎరువుల పంపిణీచేసిన విప్,తంగిరాల సౌమ్య

నందిగామ ఆగస్టు 29
(మనసులో మాట )

భూసారం పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం సాధ్యం అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

రైతులకు మేలు చేకూర్చే విధంగా, భూసారాన్ని పరిరక్షిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో నందిగామ మార్కెట్ యార్డులో శనివారం రైతులకు సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మార్కెట్ యార్డు పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి రైతులకు సేంద్రియ ఎరువులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా భూమి సారవంతంగా మారడంతో పాటు, భూమిలోని సూక్ష్మజీవుల అభివృద్ధి మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చి, ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. రసాయన ఎరువులపై అధికంగా ఆధారపడకుండా సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు, పంటల నాణ్యతను మెరుగుపరచవచ్చని ఆమె తెలిపారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను సమతుల్యంగా వినియోగిస్తూ సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన వనరులు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. "మన భూమి - మన బాధ్యత"అనే స్ఫూర్తితో భూసారాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వ్యవసాయ భూములను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె అన్నారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- ఏరియా ఆసుపత్రిలో 6వ రోజు నల్ల బ్యాడ్జీలతో 'లంచ్ అవర్' నిరసన
- సంపూర్ణ మద్దతు తెలిపిన సిఐటియు

నరసరావుపేట, ఆగస్టు 29
(మనసులో మాట)::

ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ జేఏసీ పిలుపు మేరకు నరసరావుపేట ఏరియా ఆసుపత్రి నందు కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమాలు 6వ రోజుకు చేరాయి.ఇందులో భాగంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో లంచ్ అవర్ డెమాన్‌స్ట్రేషన్ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు నరసరావుపేట నాయకులు హాజరై కాంట్రాక్ట్ వైద్య సిబ్బందికి పూర్తి సంఘీభావం,మద్దతు ప్రకటించారు.ప్రజలకు నిరంతరం నిస్వార్థ వైద్య సేవలు అందిస్తున్న పారామెడికల్ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని,కాంట్రాక్ట్ ఉద్యోగులకు తక్షణ ఉద్యోగ భద్రత కల్పించి వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని,100 శాతం గ్రాస్ జీతంతో పాటు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డులు,పెయిడ్ లీవ్స్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ వంటి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా జేఏసీ ప్రెసిడెంట్ నాగరాజ కుమారి,సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి,సిఐటియు మండల కన్వీనర్ సిలార్ మసూద్,స్టాఫ్ నర్సులు అరుణ, నవీన్,ప్రసన్న,అనూష,కోటయ్య, కుమారి,రమాదేవి ,సునీత, ల్యాబ్ టెక్నీషియన్లు కృష్ణ సింగ్, యలమందరెడ్డి,మల్లేశ్వరరావు, ఫార్మాసిస్ట్ సురేష్, ఎక్స్‌రే టెక్నీషియన్ హనుమా నాయక్ మరియు ఇతర పారామెడికల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘన సన్మానం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ

చిలకలూరిపేట ఆగస్టు 29
మనసులోమాట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా నరసరావుపేటలోని లూథరన్ హైస్కూల్‌లో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ పాల్గొని చైర్మన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడపా మోహన్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జవహర్ నాయకత్వంలో రాష్ట్రంలోని దళిత, అణగారిన వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడడం, అలాగే దళితవాడల్లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి కమిషన్ ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు. సమాజంలో ఎస్సీ వర్గాల హక్కుల రక్షణకు, అభివృద్ధికి ఎస్సీ కమిషన్ అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, పాఠశాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఏ.ఎమ్.రెడ్డి విద్యాసంస్థల్లో అంబరాన్నంటిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

- క్రీడలతోనే శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం: చైర్‌పర్సన్ డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి

నరసరావుపేట, ఆగస్టు 29
(మనసులో మాట)::

నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని ఏ.ఎమ్. రెడ్డి స్మారక విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ 121వ జయంతిని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరై మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, ఆటలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందించి వారిలో క్రీడాస్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో భారతదేశానికి గుర్తింపు తెచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని, దేశంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఇలాంటి దినోత్సవాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జునరావు,డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు,డాక్టర్ కె.కృష్ణారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు,ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడోత్సవాలను దిగ్విజయం చేశారు.



# ప్రధాన కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు

ఆగస్టు : 29
(మనసులో మాట)

మాచర్ల పట్టణంలో ప్రజల భద్రత కాపాడేందుకు వివిధ ప్రధాన కూడళ్లలో 30 సి సి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాము. ద్విచక్ర వాహనాల చోరీ దొంగతనాలను అరికట్టేందుకు ఆ సాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలలో భాగంగా పట్టణ ప్రజల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా కార్యక్రమంలో భాగంగా ఈసీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే గొలుసు కట్టు స్కీం లను నమ్మి యువత ప్రజలు మోసపోవద్దని కోరారు. యాప్ లో మొదట అప్డేట్ చేసి ఆ తర్వాత కొంత నగదు మీకు వచ్చినట్లుగా ఆశ చూపి తరువాత మిమ్ములను యాప్ వల్లద్వారా బానిసలను చేసి మోసగిస్తారని కావున గొలుసు కట్టు యాప్ ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

# రాఖీ పండుగ సందడి.. చిన్నారుల్లో ఉత్సాహం

**నాదెండ్ల ఆగస్టు 29: మనసులోమాట**



దేశవ్యాప్తంగా రాఖీ పండుగ రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులోనాదెండ్ల మండలం లోసంకురాత్రిపాడులో రాఖీ పండుగ సందడి నెలకొంది. అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్లు పరస్పరం రాఖీలు కట్టుకుని ఆప్యాయతను చాటుకున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో రాఖీ పండుగపై ప్రత్యేక ఉత్సాహం కనిపించింది. రంగురంగుల రాఖీలను ఎంచుకుని తమ అన్నయ్యలకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు చిన్నారులు ఎంతో ఆనందంగా ముందుకొచ్చారు. రాఖీ కట్టిన అనంతరం అన్నదమ్ములు తమ సోదరీమణులకు బహుమతులు అందించి, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు రాఖీ కట్టే సమయంలో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య కనిపించిన ఆప్యాయత, ప్రేమాభిమానాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను కుటుంబ సభ్యులుఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ప్రేమకు ప్రతిరూపంగా.. అనుబంధానికి గుర్తుగా.. రక్షణకు ప్రతీకగా రాఖీ పండుగను జరుపుకోవడం విశేషంగా నిలిచింది.. పండుగ ముందు రెండు రోజులు రాఖీ కొనుగోలుతో గ్రామం లో సందడి నెలకొంది.





# జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థుల వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం

- సెప్టెంబర్ 2న మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 4 అత్యాధునిక హాస్టల్ భవనాల నిర్మాణం
- 1,440 మంది బాలబాలికలకు లభించనున్న వసతి సౌకర్యం
- జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

నరసరావుపేట కాకాని వద్ద గల జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థుల వసతి సమస్యలకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. క్యాంపస్‌లో బాలబాలికల కోసం రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు అత్యాధునిక హాస్టల్ భవనాలను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సెప్టెంబర్ 2వ తేదీన ప్రారంభించనున్నారు. 2016లో ప్రారంభమైన ఈ కళాశాలలో సరైన వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి లోకేశ్ అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులను త్వరితగతిన పూర్తి చేయించారు.ఈ నూతన భవనాలు అందుబాటులోకి రావడంతో సుమారు 1,440 మంది బాలబాలికలకు సొంత క్యాంపస్‌లోనే నాణ్యమైన వసతి సమకూరి, రాకపోకల కష్టాలు పూర్తిగా తీరనున్నాయి. మంత్రి పర్యటన నేపథ్యంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం జేఎన్‌టీయూ క్యాంపస్‌ను సందర్శించి ప్రారంభోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యూనివర్సిటీ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి భద్రతా చర్యలు ,పారిశుద్ధ్యం,వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యటన సందర్భంగా హాస్టళ్ల ప్రారంభోత్సవంతో పాటు క్యాంపస్ లోని ఇతర మౌలిక వసతులు,పెండింగ్ సమస్యలపై కూడా మంత్రి దృష్టి సారించే అవకాశం ఉందని కళాశాల వర్గాలు తెలిపాయి.ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్,జిల్లా అధికారులు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడుచేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న అప్పారావు మారెళ్ల

**చిలకలూరిపేట ఆగస్టు 29 మనసులోమాట**




తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాయకత్వ శిక్షణ తరగతులు అప్రతిహతంగా కొనసాగుతూ 50 బ్యాచ్‌లను విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. ఈ శిక్షణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8,300 మందికి పైగా మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులకు పార్టీ సిద్ధాంతాలు, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలపై పక్కా ప్రణాళికతో శిక్షణ అందించడం జరిగింది.ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని, శిక్షణ అందించిన "మాస్టర్ ట్రైనర్ల"తో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా, మండలక్లస్టర్ స్థాయి నాయకులకు సోషల్ మీడియా వినియోగం, డిజిటల్ వ్యూహాలు మరియు సమకాలీన ప్రచార పద్ధతులపై విశేష శిక్షణ అందించినందుకు గాను, ఐటీడీపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మారెళ్ళ అప్పారావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా గౌరవ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పార్టీ క్యాడర్‌ను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే ఇంతటి బృహత్తర కార్యక్రమంలో భాగస్వామి కావడం,అందునా పార్టీ అధినేత, పెద్దాయన చంద్రబాబు చేతుల మీదుగా ఈ ప్రశంస అందుకోవడం పట్ల మారెళ్ళ అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు, డిజిటల్ రంగంలో తెలుగుదేశం జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లడానికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

**చిలకలూరిపేట ఆగస్టు 29 మనసులోమాట**



నియోజకవర్గ పరిధిలోని పలువురికి ఎల్ ఓ సి లు, టీడీపీ పార్టీ ప్రమాద బీమా ను పట్టణంలోని నివాసం నందు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. యడ్లపాడు మండలం జాలాది గ్రామానికి చెందిన పిల్లి ద్వారక రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించటం జరిగింది. తెలుగుదేశం పార్టీ బీమా పథకం కింద 5లక్షల రూపాయల విలువైన ఇన్సూరెన్స్ ను వారి కుటుంబ సభ్యులకు అందజేయటం జరిగింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన పావులూరి కోటేశ్వరమ్మ కి అనారోగ్య నిమిత్తం 91 వేల విలువైన ఎల్ ఓ సి నీ, యడ్లపాడుకు చెందిన కరుచోల చిన్న పిచ్చయ్య కు లక్ష రూపాయల విలువైన ఎల్ ఓ సి నీ, ఉన్నవ గ్రామానికి చెందిన ప్రత్తిపాటి దేవమనికి 1.5 లక్షల రూపాయల విలువైన ఎల్ ఓ సి నీ అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు కందిమళ్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, బోలినేని శేఖర్, నాగవర ప్రసాద్, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహితమే ధ్యేయంగా సేవలందిస్తున్న 'అర్బన్ సిఐ' పి. రమేష్ కుపుట్టినరోజు శుభాకాంక్షలు

**చిలకలూరిపేట ఆగస్టు 29 మనసులో మాట**

పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు అహర్నిశలు కృషి చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అర్బన్ సిఐ పి. రమేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. విధి నిర్వహణలో నిబద్ధత, నిష్పాక్షికతను కనబరుస్తూ, ప్రజా శ్రేయస్సే పరమావధిగా విధులు నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

**సమస్యల పరిష్కారంలో 'అర్బన్ సిఐ' ప్రత్యేక ముద్ర**

స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపిగ్గా విని, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించడంలో అర్బన్ సిఐగా ఆయన ప్రత్యేక ముద్ర వేశారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పర్యవేక్షణ, పట్టణ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో పటిష్టమైన చర్యలు చేపట్టి పట్టణ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు.

**ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల మనిషిగా**

చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా ఉంటూనే, సామాన్య ప్రజల పట్ల ఎంతో ఆప్యాయతతో మెలిగే తత్వం ఆయనది. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల రక్షణే తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ 'ఫ్రెండ్లీ పోలీసింగ్'కు నిదర్శనంగా నిలిచారు.

**ఆయురారోగ్యాలు, ఉన్నత పదవులు దక్కాలని ఆకాంక్షిస్తూ**

నిస్వార్థ సేవాభావంతో ప్రజా సేవలో ముందుంటున్న చిలకలూరిపేట అర్బన్ సిఐ పి. రమేష్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపు



కోవాలని, భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం... అదే మా నిర్ణయం... సంచలన తెలుగు దిన పత్రిక

# పెదనందిపాడు కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**పెదనందిపాడు ఆగస్టు 29 (మనసులో మాట)**

పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య ఫిజికల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాస్ లు మాట్లాడుతూ.విద్యార్ధిని విద్యార్థులకు స్పోర్ట్స్ మరియు గేమ్స్ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ "మేజర్ ధ్యాన్ చంద్" భారత దేశ హాకీ జట్టుకు అందించిన సేవలను కొనియాడినారు. మేజర్ ధ్యాన్ చంద్ 29081905 న నాటి అల హాబాద్ (నేటి ప్రయోగ్ రాజ్)లో జన్మించారు. 1922లో 16వ యేట సైన్యంలో సిపాయిగా చేరి మూన్ లైట్ లో హాకీ ప్రాక్టీస్ చేసినారు. వారు 1926 లో తమ 21 వ యేట భారత హాకీ జట్టుకు ఎంపిక అయినా రని పేర్కొన్నారు. వారి సారథ్యంలో స్వాతంత్ర్యానికి పూర్వమే 1928 ఆమ్సర్ డామ్,1932 కాలిఫోర్నియా,1936 బెర్లిన్ ఒలంపిక్స్ లో భారత హాకీ జట్టు వరసగా మూడు సార్లు గోల్డ్ మెడల్స్ సాధించడం జరిగినది. 1936 ఒలంపిక్స్ గేమ్స్ జర్మనీలోని బెర్లిన్ నిర్వహించబడ్డా యి. నాటి జర్మన్ నియంత ఎడాల్ఫ్ హిట్లర్ జర్మన్ హాకీ టీమ్ తప్పక గోల్డ్ మెడల్ సాధించాలని వారి హాకీ ఫెడరేషన్ ను ఆదేశించడం జరిగినది. కానీ మేజర్ ధ్యాన్ చంద్ నాయకత్వంలో భారత హాకీ జట్టు 81 గోల్స్ తో జర్మనీని చిత్తుగా ఓడించడంతో, ఒకింత అసహనానికి గురైన హిట్లర్ 1946 ఒలంపిక్స్ లోనైనా జర్మన్ హాకీ జట్టును అగ్రస్థానంలో నిలబెట్టడానికి ధ్యాన్ చంద్ కు జర్మన్ పౌరసత్వం తో పాటు కావలసినంత డబ్బు మరియు వారి ఆర్మీలో కల్నల్ హోదా ఇస్తానని జర్మన్ హాకీ జట్టుకు నాయకత్వం వహించవలసినదిగా ఆహ్వానించినారు, కానీ ధ్యాన్ చంద్ వారి ఆహ్వానాన్ని సునితంగా తిరస్కరించి భారత్ జట్టులోనే కొనసాగినా రు. తదనంతరం జరిగిన రెండవ ప్రపంచ యుద్ధం వలన దాదాపుగా పది సంవత్సరాల పాటు ఒలంపిక్స్ గేమ్స్ నిర్వహించబడలేదు కానీ ధ్యాన్ చంద్ నాయకత్వంలోని భారత హాకీ జట్టు వివిధ దేశాలలో భారత కీర్తిని ఉన్నత శిఖరాలకు చేర్చినది. ధ్యాన్ చంద్ తన క్రీడా జీవితంలో హాకీలో 1000 గోల్స్ మరియు ఇంటర్నేషనల్ గేమ్స్ లో 185 మ్యాచ్ లలో 510 గోల్స్ సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ జట్లో యంగ్ ప్లేయర్స్ కి అవకాశం కల్పించాలని స్వతంత్రంగా రిటైర్మెంట్ ప్రకటించి భారత జట్టుకు హెడ్ కోచ్ గా సేవలు అందించటం ప్రశంసనీయం. 1935 లో ప్రపంచ ప్రఖ్యాత క్రికెటర్ సర్ డాన్ బ్రాడ్మెన్ ఆస్ట్రేలియాలో ధ్యాన్ చంద్ ఆటను తిలకించి క్రికెట్ లో తానూ రన్స్ కొట్టినదానికంటే ధ్యాన్ చంద్ వేగంగా హాకీలో గోల్స్ చేస్తున్నారని కీర్తించినారు. భారతీయుడైన ధ్యాన్ చంద్ కు ఆస్ట్రియా దేశ రాజధాని వియన్నా లో 4 చేతులలో హాకీ బ్యాట్స్ పట్టు కున్నట్లు విగ్రహాన్ని ప్రతిష్టించినారు, అది ధ్యాన్ చంద్ లోని వేగానికి మరియు యావత్ భారతదేశానికే గర్వకారణం.1956 లో భారత ప్రభుత్వం ధ్యాన్ చంద్ ను ప్రతిష్టాత్మక పద్మభూషణ్ తో సత్కరించింది. మేజర్ ధ్యాన్ చంద్ భారత మిలటరీకి కూడా విశేష సేవలు అందించి మేజర్ హోదాలో రిటైర్ అయినారు అని విద్యార్థులకు వివరిస్తూ. వారి జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని క్రీడలలో భారత దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని, క్రీడల వలన విద్యార్థులలో ఫిజికల్ ఫిట్నెస్ పెరుగుతుంది అని, అలాగే క్రీడల వలన విద్యార్థులలో ఐక్యతా భావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ రోజు తెలుగు భాషా కోవిదుడు " గిడుగు రామ్మూర్తి" 163వ జయంతి సందర్భముగా కళాశాల తెలుగు డిపార్ట్మెంట్ తరుపున నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె ప్రతాప్ కుమార్ లు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ తెలుగు భాషను రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా వ్యాప్తి చేయాలని విద్యార్థిని విద్యార్థులకు ప్రాథమిక విద్య తెలుగు మీడియంలో అందించాలని సూచించారు, సుమారు 502 సంవత్సరాల క్రితమే విజయ నగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీ కృష్ణ దేవరాయలు గారు తెలుగు భాషను " దేశ భాషలందు తెలుగు లెస్స" అని కీర్తించి, రాయల వారి ఆస్థానంలో అష్టదిగ్గజ కవులు ద్వారా తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేశారన్నారు.నాటి బ్రిటిష్ ప్రభుత్వ అధికారి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్ / C.P. Brown) తెలుగు బాషా నిగ టువులను భావితరాలకు అందించాలని, అంతరించిపోయే దశలో ఉన్న ఎన్నో ప్రాచీన తెలుగు కావ్యాలను, తాళపత్ర గ్రంథాలను (తాటి ఆకులపై ఉన్న రచనలు) తన స్వంత ఖర్చుతో సేకరించి, పండితుల సహాయంతో వాటిని శుద్ధి చేసి, ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.ఆయనను తెలుగు ప్రజలు మక్కువతో "తెలుగు సూర్యుడు", "ఆంధ్రభాషోద్ధారకుడు" అని పిలుచుకునేవారు. భారతదేశంలో హిందీ, బెంగాలీ మరియు మరాఠీ తరువాత అత్యధికంగా మాట్లాడేది తెలుగు భాషేనని, ఈ రోజు మన సంస్కృతి క వారసత్వాన్ని గుర్తుచేసుకొనే రోజు అని తెలుగు భాషను కాపాడుకోవడం, ప్రోత్సహించడం ప్రతి తెలుగు వారి బాధ్యత అన్నారు. అలాగే మన సంస్కృతికి చిరునామా, మన చరిత్రకు జీవనాడి తెలుగు భాష. నన్నయ, తిక్కన, యర్రా ప్రగడ, శ్రీనాథుడు, పోతన, వేమన, గురజాడ, శ్రీ శ్రీ వంటి మహనీయుల రచనలు మన తెలుగు సాహిత్యం అనేక తరాలను ప్రభావితం చేస్తూనే వున్నది.

# పొన్నూరు నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**పొన్నూరు ఆగష్టు 29 (మనసులో మాట ):**

పట్టణంలోని నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను లాజరు బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈసందర్భంగా తెలుగు పండితులు కే. అన్నపూర్ణ, ఎల్. సుభాషిణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.డి. జీవల్ హక్, సిహెచ్. నాగ శ్రీనివాసరావు, ఆదే బుజ్జి తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాష అభివృద్ధి, ప్రజల వాడుక భాష కోసం గిడుగు రామమూర్తి పంతులు చేసిన ఎనలేని కృషిని వక్తలు వివరించారు. అలాగే భారత హాకీ క్రీడకు విశేష సేవలందించిన హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ క్రీడా స్ఫూర్తిని వక్తలు కొనియాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం తెలుగు



పండితులు కే. అన్నపూర్ణ, ఎల్. సుభాషిణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. ప్రసాద్‌లను ఉపాధ్యాయులు, విద్యార్థులు దృశ్యాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిన్న, ఈరోజు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై అభిమానం, క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



# "నేత్రదానం" ఉద్యమంలో పాల్గొనండి

- **"దృష్టి సందేశ దాత" అవ్వండి...**

**గుంటూరు, ఆగస్టు 29 మనసులో మాట :**

నేత్రదానం ఉద్యమంలో పాల్గొనండి... దృష్టి సందేశ దాత అవ్వండి...అని ప్రజలకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలులో భాగంగా పోస్టర్ లను శనివారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం గురించి, ప్రతి వీధిలో, ప్రతి ఊరిలో, ప్రతి సమాజ సంక్షేమ సమితిలో అన్నివిధాలా ప్రచారం చేయాలని కోరారు. ప్రజలకు చెప్పడం వల్ల ఈ ఉద్యమానికి మద్దతు లభిస్తుందన్నారు. నేత్ర దానం చేయడం ద్వారా మరణించిన అనంతరం కూడా ప్రపంచాన్ని మీ కళ్ళు చూస్తాయని అన్నారు. కళ్ళజోడు పెట్టుకొనేవారు, మధుమేహం, అధిక బ్లడ్ ప్రెషర్, ఉబ్బసం వ్యాధులతో బాధపడేవారు కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. కంటి శుక్లాల (కెటరాక్ట్) ఆపరేషన్ చేయించుకొన్నవారు కూడా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి కంటి చూపు లభిస్తుందని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి మాట్లాడుతూ మరణించిన 6 గంటల లోపు నేత్రాలను తీయవలసి ఉంటుందన్నారు. సకాలంలో నేత్రదానం జరిగేలా చూడటంలో ముఖ్య భూమిక నిర్వహించాలన్నారు. మరణించిన వ్యక్తి తన నేత్రాలను దానం చేస్తున్నట్లు ఇదివరకే ప్రతిజ్ఞ చేసినా, చేయకపోయినా సరే, ఆ కుటుంబం వారి అనుమతితో కూడా కళ్ళను తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగారావు, అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు ప్రాంత అభివృద్ధి కోసం గోదావరి జిల్లాలను సాధించండి

**వినుకొండ- ఆగస్టు 29, (మనసులో మాట )**

పల్నాడు ప్రాంత వ్యవసాయ రంగానికి తాగునీరు అందించడంలో అధికార పార్టీ నేతలు విఫలమయ్యారని వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు.శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై విరుచుకుపడ్డారు. వినుకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు కూడా పరిష్కరించలేని నాయకులు ఇక సాగునీరు ఎలా అందించగలరు అంటూ వ్యంగంగా ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో గోదావరి జలాలను రప్పించి పల్నాడు ప్రాంత అభివృద్ధికి కంకణం కట్టుకుంటామని ప్రజలను నమ్మించి పదవిలోకి వచ్చిన పల్నాడు ప్రాంత అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆచరణలో ఆ ఊసు ఎత్తడం లేదు అన్నారు ఇప్పటికైనా గోదావరి జలాల విషయంలో ముఖ్యమంత్రిని ఒప్పించి పథకం సాధించాలని బొల్లా కోరారు. నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యేగా చెప్పుకునే జీవీ ఆంజనేయులు ఈ ప్రాంత ప్రజలకు చేసిన పనులు శూన్యం అన్నారు. స్థానికంగా ప్రజా సమస్యల పరిష్కరించలేని ఆయన వైసీపీ ఎమ్మెల్యేలను శాసనసభకు హాజరు కావాలని అడగడంలో అర్థం లేదన్నారు. పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తో పాటు పల్నాడు ప్రాంతం ఎమ్మెల్యేలు అందరూ కలిసి గోదావరి జలాలను తెప్పించేందుకు కృషి చేయాలని బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు.

# రహదారి భద్రతకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

- **రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో డి ఆర్ ఓ**



**గుంటూరు, ఆగస్టు 29 (మనసులో మాట ):**

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించి, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి సూచించారు. శనివారం కలెక్టరేట్ లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రహదారి ప్రమాదాల పరిస్థితి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల భద్రతా ప్రమాణాలపై సమీక్షించారు. ముందుగా సమావేశ ఉద్దేశాలను ఉప రవాణా కమీషనర్ సీతారామిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించి, వాటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అవసరమైన హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, స్ట్రీట్ లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు తదితర భద్రతా చర్యలను పరిశీలించి చేపట్టాలని తెలిపారు. అలాగే జిల్లా పరిధిలోని నేషనల్ హైవే పై విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదని వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నేషనల్ హైవే లో సర్వీస్ రోడ్ల దగ్గర స్పీడ్ బ్రేకర్లను తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర సేవలు వేగంగా అందేలా పోలీస్, రవాణా, వైద్య, ఆర్అండ్‌బీ, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా, ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్ టి ఓ శ్రీహరి రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. విజయలక్ష్మి, ఆర్ అండ్ బి, ఎన్ హెచ్ ఏ ఐ, పోలీస్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫెయిరీల్యాండ్ బ్యూటీ పార్లర్ నూతన భవన ప్రారంభోత్సవంలో మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట ఆగస్టు 29 మనసులోమాట**

పట్టణంలోని మద్ది మల్లయ్య వీధిలో ఎస్ కె బషీర్ శైలజ తమ వ్యాపార సంస్థ ఫెయిరీల్యాండ్ బ్యూటీ పార్లర్ కోసం నూతనంగా నిర్మించిన భవనానికి గృహప్రవేశ వేడుక నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, లలితమ్మ దంపతులు పాల్గొని నూతన భవన యజమాని ఎస్.కె బషీర్ ని అభినందించి, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే అతిథులుగా జనసేన పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, జనసేన పార్టీ యువనేత మండలనేని చరణ్ తేజ,రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు కాకుమాను వెంకట్ పాల్గొని వారికి శుభాభినందనలు తెలియజేశారు.

ఈ వేడుకలో వారితో సయ్యద్ అబ్దుల్లా, తులాబందుల సుధాకర్, జల్లెడ గణేష్, తులాబందుల మణి తదితరులున్నారు.







# గత పాలకుల నిర్లక్ష్యమే పట్టణ పారిశుధ్య వ్యవస్థను దిగజార్చింది

- **కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రజల్లో చైతన్యం వచ్చి, పారిశుధ్యం మెరుగుపడింది.**
- **మత్స్య ఉత్పత్తుల విక్రయాల కోసమే ప్రత్యేకంగా మోడరన్ ఫిష్ మార్కెట్ నిర్మించాం.**
- **ఇకపై ఎవరూ ప్రధాన రోడ్లు, వీధుల్లో క్రయవిక్రయాలు జరపడానికి వీల్లేదు.**
- **రూ.1.25 కోట్లతో సకల హంగులతో నిర్మించిన చేపల మార్కెట్ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట ఆగస్టు 29 మనసులోమాట**

గత పాలకుల నిర్లక్ష్యం, అశ్రద్ధతో పట్టణవీధులు వ్యర్థాలు, చెత్తకుప్పలతో నిండిపోయాయని, ప్రజల ఆరోగ్యంతో పాటు.. పట్టణ పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా దిగజారిందని, కూటమి ప్రభుత్వం వచ్చాకే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రతా చర్యల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగి, పరిస్థితులు మెరుగుపడ్డాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

శుక్రవారం ఆయన పట్టణ నాయకులతో కలిసి స్థానిక గడియార స్తంభం వద్ద నూతనంగా నిర్మించిన అత్యాధునిక చేపల మార్కెట్ ను ప్రారంభించారు. అనంతరం స్థానికులు, చేపల విక్రయదారుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి ప్రసంగించారు.

చేపల మార్కెట్ ను విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలి

పట్టణ పురపాలక మరియు రాష్ట్ర మత్స్యశాఖ ఆర్థిక సహకారంతో రూ.1.25 కోట్లతో సకల వసతులతో 28 దుకాణాలతో నిర్మించిన మోడరన్ ఫిష్ మార్కెట్ ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్న ప్రత్తిపాటి.. చేపల విక్రయదారులు ఈ దుకాణ సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గొప్ప సదుద్దేశంతో నిర్మించిన మార్కెట్లోనే ఇకపై మత్స్య సంపదను విక్రయించాలని, రోడ్లపై, వీధుల్లో తాత్కాలిక దుకాణాలు పెట్టడానికి వీల్లేదని ఈ సందర్భంగా ప్రత్తిపాటి వ్యాపారులకు సూచించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు చేపల మార్కెట్ నిర్మాణ ప్రతిపాదనకు బీజం పడిందని, ఆనాడే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించి, నిధులు మంజూరు చేయించామని ప్రత్తిపాటి తెలిపారు. పనులు ప్రారంభించి, మార్కెట్ నిర్మాణం పూర్తిచేసి, విక్రయదారులకు అందించాల్సిన కనీస బాధ్యతను వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లు పూర్తిగా విస్మరించిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తమ ఉత్పత్తుల విక్రయం కోసం వ్యాపారాలు రోడ్లపైనే విక్రయాలు ప్రారంభించడంతో, వ్యర్థాలు, దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ప్రత్తిపాటి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, కంచర్ల శ్రీనివాసరావు, మురకొండ మల్లిబాబు, కనమర్లపూడి రమేష్, ఉప్పుటూరి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం

**గుంటూరు, ఆగస్టు 29 , మనసులో మాట:**



తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే ఎస్.ఐ.ఆర్ లక్ష్యమని జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు (జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్) రోణంకి కూర్మనాథ్ అన్నారు. అర్హమైన ఓటరు జాబితాలో ఉంటారని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నికల రోల్ అబ్జర్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు పొన్నూరు, తెనాలి మినహా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించడం జరిగిందన్నారు. జిల్లా రాష్ట్రంలో మంచి స్థానంలో ఉందని చెప్పారు. రాజకీయ పార్టీలు క్రియా శీలంగా పనిచేయాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారో, అదే స్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్ లు కూడా పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ నోటీసులు జారీ ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. జిల్లాలో మొత్తం 1,68,218 నోటీసులు జారీ చేయడం జరిగిందని చెప్పారు. 1,07,427 కేసుల విచారణ పూర్తి అయిందన్నారు. 12,596 నోటీసులకు జారీ చేసిన సమయంలోగా విచారణ పూర్తి కాకపోవడంతో మరల విచారణ తేదీలను ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 742 అర్హత లేనిదిగా గుర్తించడం జరిగిందని వివరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చే ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలకు స్పందనగా స్పష్టం చేశారు. ఫారం 6 పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. ఫారం 7లో తొలగించిన ఓటర్ల వివరాలు అందించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్. కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీ రమణి, ఇ.ఆర్.ఓ లు గంగ రాజు, పద్మావతి, లక్ష్మీ కుమారి, కాంగ్రెసు పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా.టి.సేవ కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, జన సేన పార్టీ ప్రతినిధి సి.హెచ్.త్రినాథ్, పొన్నూరు నియోజకవర్గ ప్రతినిధులు వి. మురళి కృష్ణ, ఎం.వెంకటేశ్వర రావు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రతినిధి ఎస్. కె. షిలారీ తదితరులు పాల్గొన్నారు.





# పీ.జీ.ఆర్.ఎస్ పై ప్రజల్లో నమ్మకం పెరిగింది

- సమస్యల పరిష్కారంలో వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తితో ఉన్నారు.
- ప్రజల వినతుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేసింది.
- ఆర్.టీ.జీ.ఎస్ ద్వారా స్వయంగా ముఖ్యమంత్రే పరిష్కార తీరును పరిశీలిస్తున్నారు.
- ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.
- రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటికి రాఖీలు కట్టిన తెలుగు మహిళలు.
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించిన ప్రత్తిపాటి.

**చిలకలూరిపేట ఆగస్టు 29 మనసులోమాట**

ప్రజా సమస్యల పరిష్కారాన్ని తమతో పాటు అధికారులు వారి బాధ్యతగా భావించాలని, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులనే ప్రజలు మన దృష్టికి తీసుకొస్తారనే వాస్తవాన్ని గ్రహించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పీ.జీ.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ సిస్టమ్) వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్హులైన కొందరు తమకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాలని కోరగా.. అక్టోబర్లో ప్రభుత్వం 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేయనుందని, అన్ని అర్హతలున్న వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలు అందించిన వినతుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి... వాటిలోని సమస్యల్ని స్వయంగా అధికారులకు తెలియచేశారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు.

**ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ...**

ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సహా స్వయంగా తన దృష్టికి వచ్చే ప్రజా సమస్యల అర్జీల పరిష్కారంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని చెప్పారు. ప్రభుత్వ డాష్ బోర్డు, ఆర్.టీ.జీ.ఎస్ ద్వారా ఆయన ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కార తీరుని శాఖల వారీగా పరిశీలిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఎక్కడైనా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధుల్ని కూడా సీఎం వదిలిపెట్టడం లేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

**ప్రత్తిపాటికి రాఖీ కట్టిన తెలుగు మహిళలు**

రక్షా బంధన్ ను పురస్కరించుకొని నియోజకవర్గ తెలుగు మహిళలు శుక్రవారం ప్రత్తిపాటికి స్వయంగా రాఖీలు కట్టారు. ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన తెలుగు మహిళలు.. ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలిపి, తమ వెంట తెచ్చిన రాఖీలు కట్టి, ఆయనకు మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా వారు ప్రత్తిపాటితో తమకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేకు తెలుగు మహిళా నాయకులు రాఖీలు కట్టారు.



## సామాజికవేత్త భాను ప్రసాద్‌ను సన్మానించిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్

**చిలకలూరిపేట ఆగస్టు29 మనసులోమాట:**

గుంటూరు నగరంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ శివప్రసాద్ అధ్యక్షతన "నేషనల్ స్పోర్ట్స్ డే" సందర్భంగా వివిధ క్రీడా విభాగాలకు చెందిన క్రీడాకారులు, కోచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరైన చిలకలూరిపేట పట్టణానికి చెందిన సామాజిక వేత్త, అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన దాక్షిణ్య స్కూల్స్ అధినేత టీ.వీ. రావు, డాక్టర్ గాజుల రామకృష్ణ సన్మాన గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ అథ్లెటిక్స్ కోచ్ గమిడి సాంబశివరావు మాట్లాడుతూ, భాను ప్రసాద్ అనేక సంవత్సరాలుగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. అలాగే ఓటు ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ చైతన్యం కల్పిస్తున్నారని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ, విద్యార్థి దశ నుండి షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతూ ఎంతోమంది క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అనాథలు, నిరుపేదలకు ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అండగా నిలుస్తున్నారని, అలాంటి వ్యక్తిని సన్మానించడం ఎంతో సముచితమని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత భాను ప్రసాద్ మాట్లాడుతూ, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌ను స్థాపించి గత పదిహేనేళ్లుగా క్రీడా రంగానికి చెందిన ప్రముఖులతో పాటు క్రీడాకారులను అవార్డులతో ప్రోత్సహిస్తూ, క్రీడా మాగజైన్‌ను నిర్వహిస్తూ క్రీడాకారులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్న జీవీ శివప్రసాద్ క్రీడా రంగానికి ఎంతో సేవ చేస్తున్నారని అభినందించారు.

# ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–3 పనులను వేగంగా పూర్తి చేస్తాం: పెమ్మసాని


మొదటిపేజీ తరువాయి

సుమారు 4.25 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పెమ్మసాని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రూ.48 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గతంలోనే ఈ పనులను ప్రారంభించాలనే ప్రయత్నం జరిగినప్పటికీ, గత ప్రభుత్వ హయాంలో పనులు ముందుకు సాగలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే, నాయకుల సహకారంతో రహదారి పరిధిలోని ఆక్యుపెంట్లను పునరావాసం కల్పించి, సమస్యలను పరిష్కరించి పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమం చేశామని వివరించారు.

**హైటెన్షన్ వైర్ల మార్పు.. అదనపు కల్వర్టులు**

రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఎత్తు పెరగడంతో హైటెన్షన్ విద్యుత్ వైర్లను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని పెమ్మసాని తెలిపారు. ఇందుకు అదనంగా సుమారు రూ.2-3 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే ఎన్ఎస్పీ కాలువల క్రాసింగుల వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కో కల్వర్టుకు సుమారు రూ.10-15 లక్షల అదనపు వ్యయం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో మళ్లీ సమస్యలు తలెత్తకుండా ప్రస్తుత ప్రాజెక్టులోనే సాధ్యమైనంత వరకు ఈ అదనపు పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు పెమ్మసాని తెలిపారు.





**పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన**

ప్రస్తుత ఇన్నర్ రింగ్ రోడ్డును భవిష్యత్తులో కొత్తగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని పెమ్మసాని పేర్కొన్నారు. ఈ విస్తరణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్డు ద్వారా అమరావతికి మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ అదనపు విస్తరణకు సుమారు రూ.15-20 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అయితే ఈ అదనపు పనులకు ఇంకా ఆమోదం లభించలేదని స్పష్టం చేశారు. రహదారికి అవసరమైన డ్రైనేజ్ కవర్లు, సెంటర్ లైటింగ్ వంటి అదనపు సదుపాయాలకు కూడా అదనపు అంచనాలు అవసరమవుతున్నాయని తెలిపారు.

**ప్రాంతీయ అభివృద్ధికి ఇన్నర్ రింగ్ రోడ్ ఊతం**

ఇన్నర్ రింగ్ రోడ్ అభివృద్ధి పూర్తయిన వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి కార్యకలాపాలు మరింత వేగవంతమవుతాయని పెమ్మసాని అన్నారు. ఇప్పటికే గత ఐదు, ఆరు నెలలుగా కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో అభివృద్ధి మరింత పెరిగితే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడంతో పాటు సీఆర్‌డీఏ పరిధిలోనూ మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో కార్పొరేషన్, సీఆర్‌డీఏ వనరులను సమన్వయం చేసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్‌ను అత్యుత్తమంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగరంతో పాటు అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన రవాణా కనెక్టివిటీ కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

మనసులో మాట

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్ఎంపీ చికిత్స పొందుతూ దుర్మరణం

**నాదెండ్ల ఆగస్టు 29**
**మనసులో మాట**

మండలం లోని చిరుమామిళ్ల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు షేక్ నాగూర్ వలి (55) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 19న జంగాలపల్లిలో ఓ రోగికి వైద్యం అందించి తిరిగి వస్తుండగా, బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు ఆయనను వెంటనే గుంటూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశారు. మృతుడి భార్య మస్తాన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు.




# తిలక్ స్కూల్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

- **విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి-ఎమ్మెల్యే చదలవాడ**

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం స్థానిక ప్రకాష్ నగర్ లో ఉన్న తిలక్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి క్రీడా కార్యక్రమాలను వీక్షించిన ఎమ్మెల్యే వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా ఉత్సవాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తిలక్ స్కూల్ విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో ఇప్పటికే బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. అదేవిధంగా తెలుగు భాష ప్రాధాన్యతను ఎమ్మెల్యే వివరించారు. విద్యార్థులు ఇంగ్లిష్‌తో పాటు తెలుగును కూడా చక్కగా నేర్చుకుని మాట్లాడాలని సూచించారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు,సమగ్ర శిక్షా అధికారి పి.శ్యాంప్రసాద్, సత్తనపల్లి ఉప విద్యాశాఖ అధికా పి.దేవబాబు, నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి2 యం.నాగేశ్వరరావు, టిడిపి 12వ వార్డు ఇంచార్జ్ భూమిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.రమణారావు,వ్యాయమ ఉపాధ్యాయులు జి.ఇంద్రయ్య, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మానవులందరూ ఒక్కటేనంటూ సమధర్మాన్ని చాటిన నారాయణ గురు: కేసన శంకరరావు

**మంగళగిరి, ఆగస్టు 29 (మనసులో మాట ):**



"మానవులందరిదీ ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు" అంటూ మానవత్వంతో కూడిన సమధర్మాన్ని బోధించిన గొప్ప సంఘసంస్కర్త, తత్వవేత్త, ఆధ్యాత్మిక గురువు శ్రీ నారాయణ గురు అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కొనియాడారు. నారాయణ గురు జయంతిని పురస్కరించుకుని మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకుని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసన శంకరరావు మాట్లాడుతూ.. కేరళలోని తిరువనంతపురం సమీపంలోని చెంపజంతి గ్రామంలో 1856లో నారాయణ గురు జన్మించారని తెలిపారు. చిన్ననాటి నుంచే విలక్షణమైన ఆలోచనలు కలిగిన ఆయన సంస్కృతం, ఆయుర్వేదం, జ్యోతిష్యాన్ని అభ్యసించారని చెప్పారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ఆనాటి సమాజంలో నెలకొన్న కుల వివక్ష, అంటరానితనం, ఆలయ ప్రవేశ నిషేధం వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా నారాయణ గురు అనేక ఉద్యమాలు చేపట్టారని శంకరరావు తెలిపారు. సమాజంలోని అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల సామాజిక అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని నారాయణ గురు విశ్వసించారని, దేవాలయాల నిర్మాణం కంటే పాఠశాలల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. విద్య ద్వారా ప్రజలు స్వతంత్ర ఆలోచనలను పెంపొందించుకుని సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారని చెప్పారు.

**విద్య, సేవకు ప్రాధాన్యత**

1903లో శ్రీ నారాయణ ధర్మ పరిపాలన యోగం (ఎస్ఎన్‌డీపీ) స్థాపించి విద్యాలయాలు, వైద్యశాలలు, గ్రంథాలయాలు, ఆశ్రమాలు, ఆలయాల నిర్మాణంతో పాటు అనేక ప్రజోపయోగ, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారని కేసన శంకరరావు వివరించారు. ఎస్ఎన్‌డీపీ ద్వారా నిర్మించిన కొన్ని ఆలయాల్లో సంప్రదాయ విగ్రహాలకు బదులుగా దీపం, అద్దం వంటి ప్రతీకలను ఏర్పాటు చేసి, ప్రజలు ఆత్మజ్ఞానంతో ముందుకు సాగాలని సందేశమిచ్చారని తెలిపారు. వెనుకబడిన వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల కోసం నారాయణ గురు అనేక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు.సామాజిక సమానత్వం కోసం సాగిన వైకోమ్ సత్యాగ్రహానికి కూడా ఆయన ఆలోచనలు ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు.

**మతసామరస్యానికి కృషి**

మతసామరస్యం కోసం నారాయణ గురు అనేక సర్వమత సమ్మేళనాలను నిర్వహించారని శంకరరావు తెలిపారు. మతం ఏదైనా సరే, మానవత్వంతో మెలగాలని ఆయన బోధించారని అన్నారు. విద్య ద్వారా ప్రజలు స్వతంత్రులై, వివిధ సంస్థల ద్వారా సామాజికంగా బలపడాలని సూచించారని పేర్కొన్నారు. మద్యం తయారు చేయడం, విక్రయించడం, సేవించడం వంటి వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు నారాయణ గురు ఇచ్చిన సందేశం నేటికీ ప్రాధాన్యత కలిగినదేనన్నారు. సంస్కృతం, మలయాళం, తమిళ భాషల్లో అనేక ఆధ్యాత్మిక, తాత్విక, సామాజిక, నీతి గ్రంథాలను రచించి నారాయణ గురు సామాజిక చైతన్యానికి దోహదపడ్డారని తెలిపారు. మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి జాతీయ నాయకులు సైతం ఆయన సేవలను ప్రశంసించారని గుర్తుచేశారు. నారాయణ గురు ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలందరూ, ముఖ్యంగా అణగారిన వర్గాలు ఈ జయంతి సందర్భంగా సంకల్పం తీసుకోవాలని కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరువీధుల కిరణ్, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటకృష్ణ, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి ధనుంజయరావుతో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# మాతృభాష పరిరక్షణ కోసం జనం నడుం బిగించాలి

- **అధికార భాషా సంఘం అధ్యక్షులు పులా విక్రమ్**

**తాడేపల్లి, ఆగస్టు 29 (మనసులో మాట):**



మాతృభాష పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకునే చర్యల కోసం ఎదురుచూడటమే కాకుండా ప్రజలు కూడా స్వీయ బాధ్యతతో ముందుకు రావాలని అధికార భాషా సంఘం అధ్యక్షులు పులా విక్రమ్ పిలుపునిచ్చారు. తెలుగు భాషను పరిరక్షించుకోవడం ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత అని ఆయన అన్నారు. శనివారం తాడేపల్లిలోని శ్రీ ఫార్చ్యూన్ గ్రాండ్‌లో తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిడుగు రామమూర్తి జయంతి వేడుకల్లో పులా విక్రమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు మాట్లాడే భాషే అధికార భాషగా ఉండాలని గిడుగు రామమూర్తి పరితపించారని తెలిపారు. గిడుగు రామమూర్తి గొప్ప సంస్కరణవాది అని, గ్రాంథిక భాషకు ఉన్న కట్టుబాట్లను తొలగించి వ్యవహారిక భాషను ప్రజల్లోకి తీసుకురావడానికి ఆయన విశేషంగా కృషి చేశారని పులా విక్రమ్ పేర్కొన్నారు. గిడుగు ఆశయాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంస్కరణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. తెలుగు భాషలోని అన్ని ప్రాంతాల మాండలికాలకు సాహిత్యంలో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన సూచించారు. తెలుగు భాషలోని సొగసు, సౌందర్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ప్రభుత్వపరంగా మాతృభాష అమలుకు తాను తన వంతు కృషి చేస్తానని, అదే సమయంలో ప్రజలు కూడా భాషా పరిరక్షణను స్వీయ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

**ప్రజల భాషలో సాహిత్యం రావాలి**

ప్రసిద్ధ కవి శ్రీశ్రీపై కూడా గిడుగు ఆలోచనల ప్రభావం ఉందని పులా విక్రమ్ పేర్కొన్నారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో సాహిత్యాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ ముందడుగు వేశారని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ అధికారులతో సమావేశమైన సందర్భంగా బస్సులు, ఆర్టీసీ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసే బోర్డులను తెలుగులో కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. ప్రజా జీవితంలోని ప్రతి రంగంలో తెలుగు భాషకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**మాతృభాషలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి**

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు మరియు సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) మాట్లాడుతూ.. ప్రపంచంలోని అనేక దేశాల్లో మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగుతోందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పొందుతున్న 22 భాషల్లో తెలుగు కూడా ఒకటని, అయితే ప్రస్తుతం తెలుగు భాష పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని అన్నారు. తెలుగు భాష కొడిగట్టిన దీపంలా మారకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాతృభాష పరిరక్షణే గిడుగు రామమూర్తికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. గ్రాంథిక భాష నుంచి తెలుగును వ్యవహారిక భాషగా మార్చేందుకు గిడుగు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.

# వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి

గుంటూరు , ఆగస్టు 29 (మనసులో మాట): వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. గిడుగు రామమూర్తి గొప్ప భాషా ప్రేమికుడు అని చెప్పారు. గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు అధికార భాషా దినోత్సవం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక భాష అనగానే వెంటనే గుర్తుకు వచ్చేది రామమూర్తి పంతులు అన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గ్రాంథికవాదులతో అలుపెరగని పోరాటం చేశారన్నారు. నోటిమాటకు, చేతి రాతకు సంధానం కుదిరినప్పుడే భాషకు మాధుర్యం ఉంటుందని భావించారని చెప్పారు. పండితులకే పరిమిత మైన భాషను, కొద్ది మంది మాత్రమే చదువుకునే వెసులుబాటు ఉన్న విద్యను సామాన్య ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని ఆయన పరితపించారని పేర్కొన్నారు. శిష్టవ్యవహారిక భాషకు పట్టం కట్టినప్పుడ ఇది సాధ్యమవుతుందని సంప్రదాయ భాషావాదులపై సుదీర్ఘ పోరాటం చేశారని అన్నారు. ప్రజల భావాలకు అనుగుణంగా భాష ఉండాలనీ, వాళ్ళ భావాలను అందరికీ అర్థమయ్యేరీతిలో రాయగలగాలనీ, అందుకే




వాడుక భాష చాలా అవసరం అని గిడుగు రామమూర్తి గట్టిగా వాదించారన్నారు. గురజాడ అప్పారావు, గిడుగు ఇద్దరూ అభ్యుదయవాదులు మాత్రమేకాదు, చక్కటి భావజాలాలను కలబోసుకున్న మిత్రులు అన్నారు. సవర భాష నేర్చుకొని అదే భాషలో పుస్తకాలు రాసి, సొంత డబ్బుతో బడులు ఏర్పాటు చేసి, సవరలకు చదువు చెప్పే ఏర్పాట్లను గిడుగు రామమూర్తి చేశారని తెలిపారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్నీ, 1936లో 'సవరఇంగ్లీషు కోశాన్ని తయారు చేశారన్నారు. ఆదిమ సవర జాతి గిరిజనుల భాషకు లిపిని, నిఘంటువును రూపొందించిన మహనీయుడు గిడుగు అన్నారు. ప్రభుత్వం ఆయనకు కైజర్-ఏ హింద్' అనే స్వర్ణపతకాన్ని ఇచ్చి గౌరవించిందన్నారు. 191920ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపారని చెప్పారు. తెలుగువారు ఉన్నత స్థితిలో నిలిచినప్పుడు మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను కూడా అదే స్థాయిలో ప్రపంచానికి తెలుస్తాయన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ భాష ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వ్యవహారిక భాష ఉంటే సాధారణ ప్రజానీకంకు సైతం చేరువ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డి.రమాకాంత్, ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్షకు పగడ్బందీ ఏర్పాట్లు



- **సమన్వయ సమావేశంలో కలెక్టర్ రాజాబాబు ఆదేశం**

**ఒంగోలు ఆగస్టు 29 , (మనసులో మాట)**
ఈనెల 30వ తేదీన జరిగే నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. శనివారం ఆయన అధ్యక్షతన పరీక్షల నిర్వహణపై ప్రకాశం భవనంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆన్లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షకు మొత్తం 434 మంది హాజరుకానున్నారు. దీనికోసం వల్లూరు లోని రైజ్ కృష్ణసాయి కాలేజీ, మామిడిపాలెం జంక్షన్ సమీపంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, ఒంగోలు నగరంలోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ దృష్ట్యా పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనల మేరకు పోలీసు బందోబస్తు, అభ్యర్థుల కోసం బస్సుల రాకపోకలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, పారిశుధ్యము, త్రాగునీరు, వైద్య శిబిరం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పివి రమణ, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, ఏపీసిపిడిసిఎల్ ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, ఒంగోలు డి.ఎస్.పి. శ్రీనివాసరావు, పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దారులు, పరీక్షలు జరిగే సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తికి కేరిడ్జ్ వేదిక: ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- **మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు**
- **క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తిని పెంపొందిస్తాయి:చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు**






**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**
భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో పాఠశాల ప్రాంగణంలో పలు ఆటల పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ప్రిన్సిపాల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ,యాక్టివిటీస్ కోఆర్డినేటర్ పుదోట.జగదీష్, పి.ఈ.డి.కిషోర్ బాబులతో కలిసి మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వివిధ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పట్టుదల మరియు జట్టుస్ఫూర్తిని పెంపొందిస్తాయి. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత నిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కేరిడ్జ్ స్కూల్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది అని స్పష్టం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి స్కేటింగ్ కోచ్‌లు పి.ఫిరోజ్ ఖాన్,ఎస్.కె.ఖాజా బీ, కరాటే కోచ్‌లు పి.సునీత వాణి, ఓ.శివకృష్ణ, పీఈటీ ఎం.మౌనిక బాయి విశేషంగా కృషి చేశారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినుకొండ శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ కు మాతృ వియోగం



**వినుకొండ -ఆగస్టు 29, (మనసులో మాట )**
వినుకొండ పురపాలక సంఘం శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ మాతృమూర్తి షేక్ జాన్ బి(67) కన్ను మూశారు. గత కొంతకాలం నుండి వృద్ధాప్య మరియు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిసింది. సందర్శనార్థం ఆమె భౌతికాయాన్ని మార్కాపురంలోని వారి నివాసంలో ఉంచారు. శనివారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు ప్రారంభమవుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పలువురు ప్రముఖులు ,బంధువులు భౌతికాయాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

# VITలో పవన్ కళ్యాణ్ ప్రీ-బర్త్‌డే వేడుకలు



- **ముఖ్య అతిథిగా జనసేన యువనేత జొన్న రాజేష్**

**విజయవాడ ఆగస్టు 29 (మనసులో మాట ):**
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని VIT యూనివర్సిటీలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఆగస్టు 29న ప్రీబర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ VIT యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు జనసేన యువనేత జొన్న రాజేష్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జొన్న రాజేష్ మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2న ఉండగా, ముందుగానే ప్రీబర్త్‌డే వేడుకలు నిర్వహిస్తున్న VIT విద్యార్థులను అభినందించారు. యువత, ముఖ్యంగా జెన్‌జీ తరం పవన్ కళ్యాణ్ నాయకత్వం, జనసేన సిద్ధాంతాల పట్ల ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే SRM, KLU తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు కూడా తమ కళాశాలల్లో నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు రావాలని ఆహ్వానిస్తున్నారని జొన్న రాజేష్ తెలిపారు. యువతలో రాజకీయాల పట్ల ఆసక్తి పెరుగుతోందని, ఈ నేపథ్యంలో జనసేన యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేసి యువతకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ర్యాలీలను ఆయన అభినందిస్తూ.. యువతను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేనాని పవన్ కళ్యాణ్‌కు అడ్వాన్స్‌డ్ హ్యాపీ బర్త్‌డే శుభాకాంక్షలు తెలియజేసిన జొన్న రాజేష్.. VIT విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రీబర్త్‌డే కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## పెదనందిపాడు శాఖా గ్రంధాలయాన్ని తనిఖీ చేస్తున్న గ్రంధాలయ సంస్థ చైర్మన్ వందనా దేవి



**పెదనందిపాడు ఆగస్టు 29. (మనసులో మాట)**
మండల కేంద్రమైన పెదనందిపాడు శాఖా గ్రంధాలయాన్ని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ భీమినేని వందనాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంధాలయంలో ఉన్న పుస్తకాలు కూడా పాత పడిపోయినాయి అని. ప్రస్తుతం ఉన్న గ్రంధాలయ భవనం శిథిలావస్థలో ఉన్నందున. దాతలు ఎవరైనా నూతన భవనం నిర్మించేందుకు స్థలం చూపిస్తే రాష్ట్ర అధికారులకు నూతన భవనం నిర్మాణం కొరకు ప్రపోజల్ పంపిస్తామని వందనా దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి శివ నాగేశ్వరరావు, ఐ టీడీపీ నాయకులు దివ్వి నాగరాజు, నిమ్మగడ్డ గోపి. పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# చైతన్య రథసారథి నందమూరి హరికృష్ణ సేవలు చిరస్మరణీయం



**మంగళగిరి, ఆగష్టు 29 (మనసులో మాట) :**
చైతన్య రథసారథి, స్వర్గీయ నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నందమూరి హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లోని స్వర్గీయ నందమూరి తారక రామారావు, డాక్టర్ ఎంఎస్ఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి, నందమూరి హరికృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో హరికృష్ణ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. చైతన్య రథసారథిగా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో నందమూరి హరికృష్ణకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన నిరాడంబర జీవితం, ప్రజల పట్ల ఉన్న అభిమానం, పార్టీ పట్ల చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అబద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యన్నారాయణ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు,రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి ఇబ్రహీం,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున,వంగర హనుమాన్, షేక్ నజీర్,దర్శి హరికృష్ణ,సుఖమంచి గిరిబాబు,గోవాడ దుర్గారావు, షేక్ హుస్సేన్,అమీర్ మున్ను, కంచర్ల రంగారావు,సైనాదం శ్రీనివాసరావు, కొల్లి వెంకటరావు, షేక్ సుభాని,తోట శ్రీనుబాబు,తోట కరుణ కుమార్,మాదల శ్రీను, కొత్తశ్రీను, పీల్లెళ్ళ గంగాధర్, సయ్యద్ ఖాదర్, కొత్తపేట హుస్సేన్, షేక్ బుడే, షేక్ రజియా, గోవిందు, షేక్ బాషీద్,తదితరులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో ఘనంగా క్రీడా దినోత్సవం

**వినుకొండ -ఆగస్టు 29, (మనసులో మాట )**
ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో గల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో శనివారం క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హాకీ క్రీడా రంగానికి ధ్యాన్ చంద్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం గత రెండు రోజులుగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్రీడా పోటీలలో లాంగ్ జంప్, రన్నింగ్, త్రోబాల్ తదితర విభాగాల్లో ప్రతిభ చాటుకున్న



విజేతలకు సర్టిఫికెట్లను, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నెట్ బాల్ జాతీయ క్రీడాకారుడు రవితేజ మాట్లాడుతూ క్రీడల ద్వారా సమిష్టి నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని అలాగే శారీరక మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చుండు వెంకటరావు చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, డైరెక్టర్ ధరువూరి శ్రావ్య, ధనలక్ష్మి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. నరసింహారావు, వ్యాయామ కళాశాల అధ్యాపకులు ఆర్. బలరాం నాయక్, సిహెచ్.అరవింద్,జే. శంకర్రావు, ఏ.సాయి ప్రసాద్, దాస్ తదితరులు పాల్గొన్నారు

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గోల్డ్ మెడలిస్ట్‌కు ఘన సన్మానం

**వేటపాలెం, ఆగస్టు 29: మనసులో మాట**
జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని వేటపాలెంలోని బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, సీనియర్ సిటిజన్ క్రీడాకారుడు గాత్రం ఉమామహేశ్వరరావును ఘనంగా సన్మానించారు. థాయ్‌లాండ్‌లో జరిగిన సీనియర్ సిటిజన్ లాంగ్‌జంప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన ఉమామహేశ్వరరావును కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి వేటపాలెం ప్రాంతానికి, తాను చదువుకున్న కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. కరస్పాండెంట్ చల్లా వాసుదే





వరావు మాట్లాడుతూ వయస్సు క్రీడలకు అడ్డంకి కాదని ఉమామహేశ్వరరావు నిరూపించారని, ఆయన విజయం యువతతో పాటు సీనియర్ సిటిజన్లకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రిన్సిపల్ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్ బండ్ల బాపయ్యతో పాటు కళాశాల సిబ్బంది ఉమామహేశ్వరరావును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

మనసులో మాట

# కొండవీడు ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఘనంగా ముగిసిన 'లైవ్ సర్జికల్ వర్క్‌షాప్'

**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

పట్టణంలోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్ నందు ఆగస్టు 27 నుంచి 30 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన 3వ 'హ్యాండ్స్‌ఆన్ లైవ్ సర్జికల్ వర్క్‌షాప్' ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ప్రతిష్ఠాత్మక లైవ్ సర్జికల్ వర్క్‌షాప్‌ను స్థానిక కొండవీడు ఈఎన్‌టీ ఆస్పత్రి ద్వారా వరుసగా మూడోసారి నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. పేద ప్రజలకు మేలు చేసేలా భవిష్యత్తులోనూ మరిన్ని వైద్య శిబిరాలు, శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం డాక్టర్ బయ్యా సుధీర్ చంద్ర (భవ్య ఈఎన్‌టీ ఆస్పత్రి, గుంటూరు) మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోనే



రోగులకు ప్రత్యక్షంగా (లైవ్‌గా) ఇలాంటి సర్జికల్ వర్క్‌షాప్ నిర్వహించడం అరుదైన విషయమని, ఇది జూనియర్ డాక్టర్ల నైపుణ్యాల పెంపుతో పాటు పేద ప్రజల మెరుగైన వైద్యానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ నాలుగు రోజుల వర్క్‌షాప్‌కు ఏపీఎంసీ అబ్జర్వర్‌గా డాక్టర్ మధుసూదనరావు వ్యవహరించారు. జూనియర్ వైద్యులకు శస్త్రచికిత్సల్లో మెళకువలు నేర్పించేందుకు డాక్టర్ శేషిర్ రెడ్డి (మిర్యాలగూడ), డాక్టర్ కె.ఎల్.ఎన్. ప్రసాద్ తదితర నిపుణుల బృందం పాల్గొని పలు అంశాలపై శిక్షణ, అవగాహన కల్పించారు. హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ కంచర్ల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు సాగిన ఈ వర్క్‌షాప్ విజయవంతానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుకి, చికిత్స పొందిన పేషెంట్లకు, ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యసేవ సిబ్బందికి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సాంకేతిక సహకారం అందించిన ఎస్.కె. ఎంటర్‌ప్రైజెస్, స్టోర్జ్ ఎండోస్కోపీ, కాబ్లేషన్ సెర్వెల్ గ్రూప్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ ముగింపు కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ప్రకాష్, క్యాంప్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీ వర్షిణి, డాక్టర్ విష్ణురాజ్, డాక్టర్ శ్రీధర్, సీఈవో మస్తాన్ రెడ్డితో పాటు ఆపరేషన్ థియేటర్ బృందం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**గుంటూరు, ఆగస్టు 29 (మనసులో మాట):**

గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) పరిధిలో పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ (ప్లాప్స్)లో మరియు మధ్యవర్తిత్వ కేంద్రంలో ఖాళీగా ఒక్కొక్క ఆఫీసు సబార్డినేట్ పోస్టు (రోస్టర్ పాయింట్: ఓసీ) భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని లేదా పదవ తరగతిలో తప్పిన అభ్యర్థులు కూడా అర్హులని చెప్పారు. డ్రైవింగ్, ఎలక్ట్రికల్, కార్పెంటరీ, ప్లంబింగ్, వంట, దోభీ, తోటపని, కారు మెకానిజం, వాటర్ పంప్ మెకానిజం వంటి వృత్తి నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 2026 జూలై 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి 42 సంవత్సరాలు మించకూడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, వికలాంగులు, మాజీ సైనికులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని చెప్పారు. అప్ కాస్ (APCOS) నిబంధనల మేరకు నెలకు రూ.15,000/లు వేతనం చెల్లించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులను మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత ప్రొఫార్మాలో బయోడేటాతో పాటు దరఖాస్తులను చైర్మన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, న్యాయసేవా సదన్ భవనం, జిల్లా కోర్టు ప్రాంగణం, గుంటూరు చిరునామాకు పోస్టు ద్వారా లేదా నేరుగా గాని సెప్టెంబర్ 15వ తేదీ లోగా సమర్పించాలని చెప్పారు. దరఖాస్తు చేసే పోస్టు పేరును కవరుపై తప్పనిసరిగా పేర్కొనాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత ధృవపత్రాలు, ప్రత్యేక నైపుణ్యాలకు సంబంధించిన ధృవపత్రాలు, జనన తేదీ ధృవీకరణ పత్రం, బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులైతే తాజా కుల ధృవీకరణ పత్రం, గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయబడిన పాస్‌పోర్టు సైజు ఫోటో, రూ.70/ స్టాంపు గల సెల్ఫ్ అడ్రస్ కవరు తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. వీటిని జత చేయని దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. దరఖాస్తులను నిర్దేశిత ప్రొఫార్మాలో మాత్రమే సమర్పించాలని, ఇతర ఫార్మాట్లలో వచ్చిన దరఖాస్తులు తిరస్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు టీఏ/డీఏ చెల్లించడం జరగదని తెలిపారు. ఈ నియామకం పూర్తిగా తాత్కాలికమని, గౌరవ వేతనం ప్రాతిపదికన ఉంటుందన్నారు. ఎటువంటి కారణం చెప్పకుండా ఏ సమయంలోనైనా సర్వీసును రద్దు చేసే హక్కు నియామక అధికారికి ఉంటుందన్నారు.

# అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- **ఎస్సీ కమిషన్‌కు డీబీహెచ్‌పీఎస్ అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ వినతి**



**నరసరావుపేట, ఆగస్టు 29 (మనసులో మాట)::**

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ని అగౌరవపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, ఆయనపై అభ్యంతరకర పుస్తకాన్ని ముద్రించాలని చూస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేలా పోలీసు శాఖను ఆదేశించాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి (డీబీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ ఎస్సీ కమిషన్‌ను కోరారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు మేకల బిక్షంను మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో రమేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను వారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 110 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన నరసరావుపేట మున్సిపల్ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించేలా ఎన్నికల సంఘానికి ఎస్సీ కమిషన్ ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న పేద విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా నరసరావుపేటలో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉచిత శిక్షణతో పాటు నాణ్యమైన స్టడీ మెటీరియల్‌ను అందించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని, అదేవిధంగా అంబేద్కర్ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఎస్సీ కమిషన్‌ను కోరారు.

# హెల్మెట్ ధరించండి.. సురక్షితంగా ఇంటికి చేరండి

- **నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా టీం తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ క్యాంపెయిన్**

**గుంటూరు ఆగస్టు 29 మనసులో మాట :**

నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని టీం తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాహనదారుల ప్రాణ భద్రతపై చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు 200 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ప్రయాణంలోనూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు సూచించారు. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా వాహనాలు నడపాలని, సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకోవాలని అవగాహన కల్పించారు.

**హరికృష్ణ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తాం**

నందమూరి హరికృష్ణ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల ప్రాణ భద్రత, సామాజిక బాధ్యత వంటి అంశాలపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని టీం తారక్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నపాటి జాగ్రత్తలు కూడా ప్రమాదాలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

**పోలీసుల అభినందనలు**

ఈ కార్యక్రమానికి సహకరించిన నగరంపాలెం సీఐ ఎం. రాజేష్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, నగరంపాలెం ఎస్సై రాంబాబును నిర్వాహకులు అభినందించారు. అలాగే ఎన్టీఆర్ ఫ్యాన్స్ స్టేట్ కన్వీనర్ పుల్లా సుందరంబాబు, గుంటూరు జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మద్ది రామకృష్ణ, గ్రంధి అనిల్ కుమార్, వీఎన్ఆర్ టీం, గుంటూరు ఎన్టీఆర్ ఫ్యాన్స్ టీం అందించిన సహకారాన్ని ప్రశంసించారు.



**పాల్గొన్న వారు**

ఈ కార్యక్రమంలో టీం తారక్ ట్రస్ట్ ఫౌండర్ మనోజ్ యార్లగడ్డ, కోఫౌండర్లు వంశీకృష్ణ కాగిత, కార్తీక్ యార్లగడ్డ, టీం సభ్యులు శ్యాం యార్లగడ్డ, అవినాష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంచేందుకు భవిష్యత్తులో కూడా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని టీం తారక్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.



**"హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడండి.. సురక్షితంగా ఇంటికి చేరండి."**

## రోజుకు 150 వీధి కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సలు



- **నిబంధనల మేరకు చర్యలు పకడ్బందీగా చేపట్టాలి : కమిషనర్ కె. మయూర్ అశోక్**

**గుంటూరు, ఆగస్టు 29 (మనసులో మాట):**
గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చేపడుతున్న యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రతిరోజూ కనీసం 150 వీధి కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సలు నిర్వహించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం పొన్నూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. సెంటర్‌లో వీధి కుక్కలకు అందిస్తున్న వైద్య సేవలు, శస్త్రచికిత్సల నిర్వహణ విధానం, ఆపరేషన్ థియేటర్ల పరిశుభ్రత, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పశువైద్య అధికారులు, నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధులతో సెంటర్ పనితీరుపై సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు.

**యాంటీ-రేబీస్ వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలి**

వీధి కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సలతో పాటు యాంటీరేబీస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. కేవలం శస్త్రచికిత్సల సంఖ్యను మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మొత్తం ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఆపరేషన్ అనంతరం కుక్కలు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు తగిన సమయం, పోషకాహారం, అవసరమైన యాంటీరేబీస్ వ్యాక్సినేషన్, వైద్య పర్యవేక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రమే వాటిని పట్టుబడిన ప్రాంతాల్లోనే సురక్షితంగా తిరిగి వదిలిపెట్టాలని తెలిపారు.

**అదనపు డాగ్ క్యాచింగ్ బృందాలు, వాహనాలు**

నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వీధి కుక్కలను సురక్షితంగా ఏబీసీ సెంటర్‌కు తరలించేందుకు అవసరమైన డాగ్ క్యాచింగ్ బృందాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అవసరాన్ని బట్టి అదనపు వాహనాలను కాంట్రాక్ట్ ఏజెన్సీయే సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు.

**ఏబీసీ సెంటర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి**

ఏబీసీ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు సదుపాయాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సెంటర్‌కు కాంపౌండ్ వాల్, మెయిన్ గేట్ నిర్మాణ పనులు చేపట్టాలని ఎస్ఈకి సూచించారు. జంతు ప్రేమికులు లేదా స్వచ్ఛంద సంస్థలు ఏబీసీ సెంటర్ నిర్వహణకు ముందుకు వస్తే, వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విపిఎస్‌ను ఆదేశించారు.

**రోడ్లపై పశువులు తిరిగితే చర్యలు**

నగరంలోని రోడ్లపై ఆవులు, ఎద్దులు విచ్చలవిడిగా తిరగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను జిఎంసి గోశాలకు తరలించాలని, వాటి యజమానులపై నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు.

**అనుమతి లేకుండా రోడ్డు తవ్వితే చర్యలు**

అనంతరం కెవిపి కాలనీ మెయిన్ రోడ్డును కమిషనర్ పరిశీలించారు. జిఎంసి నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా రోడ్డును తవ్వి కేబులింగ్ పనులు చేపట్టడంపై సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఏజెన్సీకి నోటీసులు జారీ చేయాలని, వారి ఖర్చుతోనే తవ్విన రోడ్డును తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిఈఈ, ఏఈలను ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా కేబుల్ లైనింగ్ కోసం రోడ్లను తవ్వాల్సి వస్తే తప్పనిసరిగా గుంటూరు నగరపాలక సంస్థ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

# ఎండుతున్న గొంతులకు జలామృతం..!

- **రూ.1000 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టులు..!**
- **మాచర్ల నియోజకవర్గ చరిత్రలో సువర్ణాధ్యయం..!**
- **జల్ జీవన్ మిషన్,అమృత్ పథకాల ద్వారా కృష్ణా జలాలు..!**
- **వచ్చే నెల 1న పథకానికి ఘనంగా శంకుస్థాపన**





**మాచర్ల ఆగస్టు : 29 (మనసులో మాట)**
తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఎగువ పల్నాడు ప్రాంతమైన మాచర్ల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రాకతో ప్రతి ఇంటికీ జల సిరులు బిరబిరా పరుగులు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దార్శనికులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రగతి రథంపై నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోడి నియోజకవర్గంలో సర్వతోముఖాభివృద్ధి శరవేగంగా జరుగుతోంది"..!

**గ్రామీణ తాగునీటికి రూ.800 కోట్లతో జల్ జీవన్ మిషన్ ..!**

మాచర్ల నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో గ్రామీణ తాగునీటి అవసరాలకు రూ.800 కోట్లతో జల్ జీవన్ మిషన్ పైపులైన్ పనులను ఇప్పటికే శరవేగంగా చేపట్టారు. మాచర్ల మండలంలోని విజయపురిసౌత్ వద్దనున్న మేకలగొంది వద్ద సాగర్ జలాలను శుద్దికి అతిపెద్ద వాటర్ ఫిల్టర్ పంపుహౌస్ నిర్మిస్తున్నారు. అక్కడి నుంచి శుద్ధ జలాలను పైపులైన్ల ద్వారా మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, కారంపూడి మండాలకు నీటిని తరలిస్తారు. మరోవైపు అవసరమైన ప్రాంతాల్లో ఇప్పటికే ఓవర్ హెడ్ నీటి ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయి. దాదాపు రూ.1200 కోట్లతో నిర్మిస్తున్న ఈ వాటర్ గ్రిడ్ ఒక్క మాచర్ల నియోజకర్గంలోనే రూ. 800 కోట్లకు పైగా నిధులు వెచ్చించనున్నారు. ఈ వాటర్ గ్రిడ్ అందుబాటులోకి వస్తే దాదాపు తాగునీటి ఎద్దడిని పూర్తిస్థాయిలో శాశ్వతంగా చెక్ పెట్టవచ్చునని అధికారులు చెబుతున్నారు.

**మాచర్ల మున్సిపాలిటీ చరిత్రలో సువర్ణాధ్యయం..!**

1983 లో మేజరు పంచాయతీగా ఉన్న మాచర్లను గ్రేడ్ 3 మున్సిపాలిటీ గా ప్రకటిస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత గ్రేడ్2 గా అప్ గ్రేడ్ అయ్యింది. మాచర్ల మున్సిపాలిటీ పరిధి రానున్న 25 ఏళ్లకు సరిపడా తాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర తాగునీటి సరఫరా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. రెండు దశాబ్ధాలుగా తాగునీటి కోసం ప్రజలు మున్సిపల్ ట్యాంకర్లు.., నీటి వ్యాపారం చేసే ప్రైవేటు వ్యవస్థలపై ఆధారపడి నెలవారీ డబ్బులిచ్చి మరి తాగునీటికి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితిని ఇక బయటపడనున్నది. కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 స్కీమ్ ద్వారా దాదాపు రూ. 146 కోట్లకు పైగా నిధులతో ప్రతి ఇంటికీ తాగునీటి కులాయిలతో శుద్ధ జలాలను అందించేందుకు వచ్చే నెల 1వ తేదీన పట్టణంలోని శ్రీనివాస మహాల్ సెంటర్ నందు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

**వచ్చే ఏడాది నాటి ఇంటింటికీ బుగ్గవాగు జలాలు..!**

మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని వచ్చే ఏడాది నాటికి బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను అమృత్ పథకం 2.0లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయిలు ద్వారా శుద్ధి చేసిన జలాలను అందించనున్నది కూటమి ప్రభుత్వం. వేసివి కాలం వచ్చిందంటే సాగర్ కుడి కాలువకు నీరు ఆగిపోవడం, మున్సిపాలిటీ క్వారీలో నీరు ఇంకిపోవడం వంటివి సర్వసాధారణంగా ఎదురయ్యే సమస్య. తీవ్ర తాగునీటి ఎద్దడికి దారితీసే పరిస్థితుల్లో పట్టణ జీవనం కనీస అవసరాలకు నీరు అందక కడు దుర్భరంగా మారేది. తాగునీటి కోసం ప్రత్యేక బడ్జెట్ పెట్టి.., ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించినప్పటికీ అనుకున్న లక్ష్యాలను మున్సిపాలిటీ అందుకోలేక ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తేవి. ఈ క్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పట్టణంలోని తాగునీటి ఇబ్బందులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా.., కేంద్రంతో సంప్రదింపులు జరిపి అమృత్ స్కీమ్ 2.0 ద్వారా నిధులను మాచర్ల మున్సిపాలిటీకి కేటాయింపులు జరిపింది కూటమి ప్రభుత్వం. రూ. 146 కోట్ల పైగా నిధులతో నిర్మించే ఈ వాటర్ గ్రిడ్ ను యుద్ధ ప్రతిపాదికన నిర్మించేందుకు మేఘా ఇంజినీరింగ్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ గుత్తేదారు సంస్థ వచ్చే నెల నుంచి పనులను ప్రారంభించనున్నది.

**అమృత్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ రోడ్డు మ్యాప్ ఇలా .!**

అమృత్ 2.0 ద్వారా దాదాపు రూ.146 కోట్ల వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పనులను దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ గుత్తేదారు సంస్థ ముందుగా బుగ్గవాగు రిజర్వాయర్ ద్వారా తాగునీటిని లిఫ్ట్ ద్వారా ఎత్తిపోసేందుకు కావాల్సిన మౌళిక సదుపాయాలను సిద్ధం చేస్తోంది. ఆ తరువాత మాచర్ల మున్సిపాలిటీ పంపు హౌస్ నందు ఎకరం నర ఖాళీ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ లోకి నీటిని బుగ్గవాగు నుంచి పైపులైన్ సహకారంతో తరలిస్తారు. అక్కడ శుద్ధి చేసిన జలాలను మున్సిసాలిటీలో పంపు హౌస్ నందు అందుబాటులో ఉన్న 22 లక్షల కెపాసిటీ వాటర్ స్టోరేజ్ ఉన్న రెండు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపుతారు. ఆ తరువాత ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా మాచర్ల పట్టణంలో ఫైర్ స్టేషన్ వద్ద ( 10 లక్షల వాటర్ కెపాసిటీ ), రోప్ వే కాలనీ లో ( 8 లక్షల వాటర్ కెపాసిటీ), టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద ( 6 లక్షల వాటర్ కెపాసిటీ), వినాయకునిగుట్టపై ( 5 లక్షల వాటర్ కెపాసిటీ), లింగాపురం కాలనీ (3 లక్షల వాటర్ కెపాసిటీ) వంటి ప్రాంతాల్లో నూతనంగా వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మాణాలు జరిపి, 24 గంటలకు తాగునీటి అందించేందుకు చర్యలు తీసుకుంటారు. మరోవైపు వచ్చే ఏడాది నాటికి పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేసి, ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రణాళికబద్దంగా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది.

# ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి



**వినుకొండ -ఆగస్టు 29, (మనసులో మాట )**

ఎదురెదురుగా వస్తున్నా వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నూజెండ్ల మండల పరిధిలోని గుర్రప్ప నాయుడు పాలెం గ్రామం వద్ద శనివారం ఉదయం చోటు చేసుకుంది. నూజెండ్ల గ్రామానికి చెందిన పులి గుజ్జు వెంకట్రావు (35) వినుకొండ పట్టణంలోని ఒక సోలార్ కంపెనీలు చిరు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన వెంకటరావుకు మార్గ మధ్యలో గుర్రప్ప నాయుడుపాలెం గ్రామం వద్ద ఎదురుగా వేగంతో వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. సంఘటనలో తీవ్ర గాయాల పాలై రక్తపు మడుగులో పడి ఉన్న వెంకటరావును స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మార్గమధ్యలోనే క్షతగాత్రుడు వెంకట్రావు మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తీవ్రంగా విలపిస్తున్న భార్యాపిల్లలు**

ప్రమాద సంఘటనలో మృతి చెందిన పులి గుజ్జు వెంకటరావుకు భార్య ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. రోడ్డు ప్రమాద సంఘటన గురించి సమాచారం అందుకొని వినుకొండ ఆసుపత్రి చేరిన వారు వెంకటరావు మృతదేహాన్ని చూసిభోరున విలపించారు. కుటుంబానికి దిక్కుగా ఉన్న వెంకటరావు మృతి తో దిక్కులేని వారమయ్యాము ని విలపించారు. బతుకు తెరువు కోసం ఇంటి నుంచి బయలుదేరిన కొద్దిసేపటికి అనంత లోకాలకు వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మిన్నంటిన వారి రోదనలు చూపరుల హృదయాలను కదిలిస్తున్నాయి.

# శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ



**వినుకొండ--ఆగస్టు 29, (మనసులో మాట)**

వినుకొండ పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ శనివారం విప్ జీవీ ఆంజనేయులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన చీఫ్ విప్ కు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేటపాలెం పరిధిలో భూగర్భ జలాలపై నీటి మాఫియా దందా?

- **రిసార్టులకు, ప్రైవేటు అవసరాలకు నీటి దందా**
- **అడుగంటుతున్న భూగర్భ జలాలు.. పట్టించుకోని అధికారులు!**
- **రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**
- **వాల్టా చట్టానికి విరుద్ధంగా నీటి తరలింపు?**
- **రోజూ వందల ట్యాంకర్లతో నీటి తరలింపు.. అధికారుల మౌనమేంటి?**
- **తక్షణమే తనిఖీలు చేసి అక్రమ నీటి తరలింపును నిలిపివేయాలి**

**వేటపాలెం ఆగస్టు 29 మనసులో మాట**

వేటపాలెం: మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 420, 432, 192 లో భూగర్భ జలాలను అక్రమంగా తోడేస్తూ నీటి ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు



బోర్ల నుంచి నీటిని తోడి రోజుకు వందలాది ట్యాంకర్ల ద్వారా రిసార్టులు, ప్రైవేటు అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా భూగర్భ జలాల విచ్చలవిడి వినియోగం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నీటిని వాణిజ్య అవసరాలకు తరలించేందుకు అవసరమైన అనుమతులు, పర్మిషన్లు ఉన్నాయా? లేదా? అన్న విషయంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రోజూ పెద్దఎత్తున భూగర్భ జలాలను తోడేస్తే భవిష్యత్తులో బోర్లు ఎండిపోయి తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు నీటి నాణ్యతపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని



వారు చెబుతున్నారు.

**నీటి మాఫియాపై చర్యలు ఎప్పుడు?**

ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన భూగర్భ జలాలను ప్రైవేటు వ్యాపారానికి తరలిస్తున్నారనే ఆరోపణలపై రెవెన్యూ, భూగర్భ జలాల శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమంగా నీటి తరలింపు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నీటి తరలింపును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నీటి దందా సాగుతోందా? అంటూ గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలను కాపాడాల్సిన అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# పొగ బారిన రహదారులు ఆందోళనలో వాహనదారులు

**వినుకొండ -ఆగస్టు 29,(మనసులో మాట )**

చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి రహదారి పొగ బారింది. వినుకొండ పట్టణ సమీపంలోని మార్కాపురం వెళ్లే మార్గంలో పసుపులేరు బ్రిడ్జి సమీపంలో వినుకొండ పురపాలక సంఘం వారు పట్టణంలో సేకరించిన చెత్తాచెదారం డంపింగ్ చేస్తుంటారు. అక్కడ ఈ చెత్త పేరుకుపోయిన తర్వాత దానికి నిప్పంటించి నిర్మూలించేందుకు ప్రయత్నం చేస్తుంటారు.ఈ క్రమంలో ఆ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఏర్పడిన చెత్తకుప్పలను నిర్మూలన కొరకు నిప్పంటించినట్లు తెలిసింది.దీంతో మంటలు వ్యాపించి దట్టమైన పొగ తయారయింది. జాతీయ రహదారి ఈ ప్రాంతం ప్రక్కనే ఉండటంతో విపరీతంగా వ్యాపించిన దట్టమైన పొగతో ప్రధాన రహదారి మార్గం పొగ మయమైంది. ఈ పొగదాటికి రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాల కూడా కనిపించకపోవడంతో వాహనదారుల ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎదురుగా వస్తున్న వాహనాలను





గుర్తించకుండా ప్రయాణించడం తీవ్రమైన కష్టంగా మారింది. మరోవైపు దట్టంగా వ్యాపించిన ఈ నల్లటి పొగ కాలుష్యంతో వాహనదారులకు కళ్ళు మంట కలగడం, దగ్గు రావడం వంటి కాలుష్య ప్రభావాలకు లోన వుతున్నారు. వీటన్నిటితో ఈ ప్రాంతం రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని వాహన చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. తరచూ జరుగుతున్నటువంటి ఈ సంఘటనలతో ఆ మార్గంలో ప్రయాణించే వారికి ఇది దినదిన గండంగా మారుతుందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ప్రమాదాలకు అవకాశం గా ఉన్న డంపింగ్ యార్డులను జాతీయ రహ ప్రధాన రహదారులకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల నిరంతరం జాగరుకతతో ఉండాలని సదుద్దేశంతో హెచ్చరికలు చేస్తున్న అధికారులు ప్రమాదాలకు కారణమయ్యే ఇటువంటి డంపింగ్ యార్డులను జాతీయ రహదారుల పక్కన ఏర్పాటు చేయటం, వాటికి నిప్పులు అంటించడం వంటి సంఘటనలను కొనసాగిస్తూ పరోక్షంగా ప్రమాదాలకు కారుకులవుతున్నారని వాహన దారులు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయంలో సరైన ఆలోచనలు చేసి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం సమంజసంగా ఉంటుంది.

# జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహణ

**విజయపురిసౌత్, ఆగస్టు 29, (మనుసులో మాట )**

నాగార్జునసాగర్ విజయపురిసౌత్ లోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాగార్జునసాగర్‌లోమేజర్ ధ్యాంచంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా



పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని ప్రిన్సిపాల్ డా యన్. శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో క్రీడా స్ఫూర్తిని, విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు "క్రీడలు – ఆరోగ్యానికి, క్రమశిక్షణకు, విజయానికి పునాది" అనే సందేశంతో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ కేవీఎల్ కృష్ణారావు, వలినాథ్, పీడీ రామకృష్ణలతో పాటు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.